APTEL/25/A2082

# పతాకం న్యూస్

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 243 | విశాఖపట్నం | 3-6-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 243 | VISAKHAPATNAM | 3-6-2026 WEDNESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-



SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI
yono SBI | BHIM SBI Pay
G Pay | Paytm | Pay


Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



# గిరిజన గ్రామాల్లో.. అధ్వానంగా రహదారులు?

- కాలినడకన కూడా రాకపోకలు సాగించలేని వైనం
- ఏటా ప్రతిపాదనలతోనే సరి
- గిరిజనులకు తప్పని ఇబ్బందులు

**భామిని, పతాకం న్యూస్:** ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కూటమి సర్కారు చర్యలు తీసుకుంటున్నా.. ఇంకా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడంతో భామిని మండలంలో పలు గిరిశిఖర గ్రామాలు మౌలిక వసతులకు నోచుకోవడం లేదు. కనీసం రహదారి సౌకర్యం కూడా లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాళ్లు తేలిన మట్టి రోడ్లపై కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి. దీంతో అత్యవసర వేళల్లో వారికి డోలీ మోతలు తప్పడం లేదు. ఏటా రోడ్ల నిర్మాణ ప్రతిపాదనల పేరిట హడావుడి తప్పితే.. ఆ తర్వాత ఎవరూ పట్టించుకోవడం లేదని గిరిశిఖర గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని వారు కోరుతున్నారు. భామిని మండలంలో గిరిశిఖర గ్రామాలైన కోటకొండ, కోసిమానుగూడకు కనీసం రహదారి సదుపాయం లేదు. ఇవి మండల కేంద్రానికి సుమారు 12 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 50 కుటుంబాలు జీవిస్తున్నాయి. అయితే విద్య, వైద్యం, నిత్యావసరాల కోసం రోజూ వారు కొండ దిగి ఎక్కాల్సి వస్తోంది. సుమారు 5 కిలోమీటర్లు రాళ్లు రప్పలు దాటి.. బంద్రసింగి లేదా మణిగ రోడ్డు వరకు చేరుకోవాల్సి వస్తోంది. 2017-18లో అప్పటి టీడీపీ ప్రభుత్వం.. ఆయా గిరిశిఖర గ్రామాల్లో మట్టి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు భామిని నుంచి కోటకొండ, బంద్రసింగి, కోసిమానుగూడ, డోకులగూడ తదితర గిరిజన గ్రామాలకు మట్టి రోడ్లు నిర్మించారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక రోడ్ల నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో ఆయా రహదారులు అధ్వానంగా మారాయి. వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోవడంతో ఆయా ప్రాంతవాసులకు దారి కష్టాలు తప్పడం లేదు. స్థానిక ఏబీ రోడ్డు నుంచి ఇసుకగూడ మీదుగా డోకులగూడ వరకు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం రూ. 72లక్షలు మంజూరు చేసింది. అయితే అప్పట్లో వివిధ కారణాలతో అరకొరగా సీసీ రోడ్డు పనులు చేసి విడిచిపెట్టారు. దీంతో వర్షాలకు ఆ రోడ్డు పనులు కొట్టుకుపోయాయి. ప్రస్తుతం బైక్‌పై కూడా వెళ్లలేని విధంగా రోడ్డు తయారైంది. కొత్త రోడ్డు మంజూరుకు సాంకేతిక అడ్డంకులున్న నేపథ్యంలో ఇసుకగూడ నుంచి డోకులగూడ, గేదెలగూడ వరకు నిలిచిపోయిన రోడ్డు పనులను పునరుద్ధరించాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు. ఇటీవల మణిగ రోడ్డు నుంచి కడంబసింగి రోడ్డు వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయిటే టెండర్లు పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభం కావడం లేదు.



7లో

## ఫార్మా వ్యర్థాలు శుద్ధి చేయకుండా బయటకు విడుదల!



5లో

## ఉచిత బస్సు సౌకర్యంతో ప్రజల అవస్థలు!



6లో

## ఆస్తమా సమస్య ఉన్నవారు ఆహార విషయంలో జాగ్రత్తగా ఉండాలి!

# పనిచేయకపోతే పక్కనపెట్టేస్తా: చంద్రబాబు






**మంగళగిరి, పతాకం న్యూస్:** మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, పరిశీలకుల కోసం నిర్వహించిన ఎస్ఐఆర్ వర్క్‌షాప్‌లో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 4న ఎన్డీఏ నేతల సమావేశం జరగనుందని తెలిపారు. రాష్ట్ర, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో (తరువాయి 2వ పేజీలో)

## ఏపీలోని పలు జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వేసవి కాలం.. అందునా రోహిణి కార్తె కావడంతో ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలో రుతుపవనాల ప్రవేశానికి ఇంకా సమయం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో తీవ్రమైన (తరువాయి 2వ పేజీలో)


APTEL/25/A2082
పతాకం న్యూస్
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH


# జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే ఒ బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్ రాజు మంగళవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తర నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ, స్ట్రీట్‌లైట్ల ఏర్పాటు మరియు నిర్వహణ వంటి అభివృద్ధి కార్యక్రమాల వివరాలను కమిషనర్‌కు అందజేసిన ఎమ్మెల్యే, ప్రజలకు ఉపయోగపడే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా ఉత్తర నియోజకవర్గంలోని వివిధ కళ్యాణ మండపాల నిర్వహణ అంశాన్ని కూడా కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా జీవీఎంసీ ఆధ్వర్యంలో కళ్యాణ మండపాలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు అవసరమైన మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు. అలాగే మాధవధార అంబేద్కర్ కాలనీలో టీడీఆర్‌కు సంబంధించిన అంశాలు, వివిధ వార్డుల్లో స్ట్రీట్‌లైట్ల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

# బెదిరింపులకు భయపడను.. తెలంగాణలో జనసేన పోటీ చేస్తుంది: పవన్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. తెలంగాణలో పోటీ చేస్తామని ఆయన కుండ బద్దలు కొట్టారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. దేశంలో అంతర్భాగం తెలంగాణ అని స్పష్టం చేశారు. తెలంగాణను వ్యతిరేకించిన వారే.. పదవుల్లో ఉన్నారు.. ఎమ్మెల్యేలు అయ్యారని పవన్ కల్యాణ్ వివరించారు. 13వ ఏట అడుగుపెడుతున్న తెలంగాణకు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష మందికిపైగా జనసేన నాయకులు, సైనికులు ఉన్న.. తెలంగాణలో కేడర్ తరఫున ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణలో జనసేన పార్టీ పుట్టిందని గుర్తు చేశారు.



## నాగచైతన్యకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట.. అశ్లీల కంటెంట్ తొలగించాలని ఆదేశం

2లో


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ఎవరికి ప్రయోజనకరం?

దేశీయంగా వ్యవసాయాన్ని ఆధునీకరించకుండా, స్వల్ప స్థాయి ఉత్పత్తి నుండి భారీ స్థాయి ఉత్పత్తికి పరిణతి చెందకుండా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలతో కుదుర్చుకునే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్.టి.ఎ లు) దేశానికి మేలు చేకూర్చుతాయా? నేడు భారతదేశ వాణిజ్య విధానాన్ని పట్టి పీడిస్తున్న మల్టీ బిలియన్ డాలర్ల ప్రశ్న ఇది. దీనికి సమాధానం ఒక్కటే! దేశీయ వ్యవసాయ సంస్కరణలు చేపట్టకుండా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల మనకు ఒరిగేదేమీ ఉండదు. పైగా మన వ్యవసాయ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎం.ఎస్.ఎం.ఇ లు)ను విదేశీ మార్కెట్ శక్తులకు తాకట్టు పెట్టడమే అవుతుంది. న్యూజిలాండ్ (కివీస్ అని కూడా పిలుస్తారు) వంటి అత్యంత సమర్థవంతమైన, భారీ-స్థాయి ఉత్పత్తిదారులకు మన సరిహద్దులను తెరిచేటప్పుడు తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు కూడా తీసుకోలేదు. ఒక వైపు చిన్న చిన్న భూ కమతాలను సాగు చేస్తున్న మన రైతులు అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈ స్థితిలో న్యూజిలాండ్‌తో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం సహజంగానే మనకన్నా అవతలి పక్షానికే ఎక్కువ ప్రయోజనకరం. న్యూజిలాండ్‌కు చెందిన ఒక పాడి రైతు పాలు పిండడానికి, పశువులకు అవసరమైన పచ్చిక బయళ్ల నిర్వహణకు అధునాతనమైన మిషన్లు, శాటిలైట్ డేటాను ఉపయోగించి సుమారు 160 హెక్టార్ల భూమిని, 400 ఆవులను నిర్వహిస్తాడు. దీనికి భిన్నంగా సగటు భారతీయ రైతు స్వయం చాకిరీతో 1.08 హెక్టార్ల భూమిని, 2-3 ఆవులను నిర్వహిస్తాడు. విజ్ఞాన, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, ఉత్పత్తిదారుల సహకార సంఘాలు, సమిష్టి సాగు కోసం భూములను సమీకరించడం ద్వారా భారీగా ఉత్పత్తి పెంచే మార్గం గురించి ఆలోచించకుండా ఉత్పత్తి, ఉత్పాదకత, ధర విషయంలో విదేశాలతో మనం పోటీ పడలేం. న్యూజిలాండ్ ఉత్పత్తి వ్యయం భారతదేశం కంటె తక్కువ. కాబట్టి సుంకాలు ఉన్నప్పటికీ మార్కెట్‌లో వారి ఉత్పత్తులు మన ఉత్పత్తుల కన్నా తక్కువ ధరకు లభ్యమవుతాయి. 2022లో న్యూజిలాండ్ లోని మొత్తం వ్యవసాయ క్షేత్రాల సంఖ్య 47,000 లోపే. ఈ రకమైన భూ కేంద్రీకరణ వల్ల తక్కువ సంఖ్యలోనే అయినా చాలా పెద్ద కమతాలు చాలా రంగాల్లో ఏర్పడ్డాయి. న్యూజిలాండ్ వ్యవసాయ రంగం మొత్తం శ్రామిక శక్తిలో కేవలం 5.6 శాతం నుండి 6.6 శాతం మందికి మాత్రమే ఉపాధి కల్పిస్తుండగా, భారత్‌లో 48 శాతం శ్రామిక శక్తి ఈ రంగంపై ఆధారపడి ఉంది. న్యూజిలాండ్‌లో వ్యవసాయం అనేది ఒక పెద్ద పరిశ్రమగా మారింది. మన దేశంలో వ్యవసాయం ఒక జీవనాధారం. ప్రపంచ స్థాయిలో పోటీ పడాలంటే న్యూజిలాండ్ రైతులకు అధిక యాంత్రీకరణ అవశ్యం. కివీస్ వ్యవసాయ యంత్రాల మార్కెట్ కూడా పుంజుకుంది, 2025 నాటికి డెలివరీలు 10 శాతం పెరిగాయి. ప్రెసిషన్ టెక్నాలజీ ఆధారిత యాంత్రీకరణ ప్రాథమిక ట్రాక్టర్ల స్థాయిని దాటి, డ్రోన్లు, జిపిఎస్-మార్గదర్శక వ్యవస్థలు, నేల, పంట పర్యవేక్షణ కోసం సెన్సార్లను చేర్చింది. గ్రామీణ కార్మికుల కొరతను పూడ్చడానికి, నాట్లు వేయడం, కలుపు తీయడం దగ్గర నుంచి పంట నూర్పిడి దాకా సమస్త పనులకు ట్రాక్టర్లు, రోబోటిక్స్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. వ్యవసాయ రంగంలో భారత్, న్యూజిలాండ్‌లను పోల్చి చూస్తే, కొన్ని తీవ్రమైన తేడాలను గమనించవచ్చు. భారత్ లక్షలాది మంది చిన్న రైతులతో భారీ స్థాయిలో పనిచేస్తుండగా, న్యూజిలాండ్ వనరులు వృథా కాకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి, పారిశ్రామికీకరించబడిన ఎగుమతి-ఆధారిత నమూనాలో పనిచేస్తుంది. ఈ రెండు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అత్యంత సున్నితమైన అంశం, ప్రధానంగా ఈ నిర్మాణాత్మక వ్యత్యాసాల కారణంగానే. భారతదేశ వ్యాప్తంగా ఎనిమిది కోట్ల మంది పాడి రైతులు ఉన్న పాడి రంగాన్ని ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నుండి మినహాయించారు. దేశవ్యాప్తంగా ఎక్కడ ప్రతిఘటన వస్తుందోనన్న భయం కూడా ఇందుకు ఒక కారణం. ఏదేమైనా, భారత వ్యవసాయాన్ని ప్రపంచ వాణిజ్య వ్యవస్థకు దాసోహం చేయడమే లక్ష్యంగా ఉన్న భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని తిప్పికొట్టేందుకు అన్ని రంగాల రైతులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరమెంతైనా ఉంది. గతంలో జరిగిన భారత్-అమెరికా, భారత్-ఇ.యు వాణిజ్య ఒప్పందాల మాదిరిగానే, ఈ ఒప్పందం కూడా దేశద్రోహ మోడీ ప్రభుత్వ బండారాన్ని బయటపెడుతోంది. 2026 ఏప్రిల్ 27న సంతకం చేసిన భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో భాగంగా, న్యూజిలాండ్ తన ప్రీమియం ఉత్పత్తులకు, ముఖ్యంగా ఉన్నత శ్రేణి పండ్లు, మాంసం, మద్యానికి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన మార్కెట్‌ను వశపరచుకుంది. న్యూజిలాండ్ యాపిళ్లపై సుంకాన్ని 50 శాతం నుండి 25 శాతానికి భారత్ తగ్గించడంపై హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్ లోని యాపిల్ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కనీస దిగుమతి ధర కిలోకు 1.25 డాలర్లు కాగా, ప్రస్తుత కరెన్సీ రేటు ప్రకారం ధర రూ.119గా ఉంటుంది. 25 శాతం సుంకంతో న్యూజిలాండ్ యాపిల్ భారత హోల్‌సేల్ మార్కెట్‌లోకి రూ.148.75 నికర ధరతో వస్తుంది. అలాగే, న్యూజిలాండ్ నుంచి దిగుమతి అయ్యే కివీ పండ్లపై 33 శాతంగా ఉన్న సుంకాన్ని 0 శాతానికి తగ్గించారు. దీనివల్ల అరుణాచల్ ప్రదేశ్, ఇతర ఈశాన్య రాష్ట్రాలలో ఎక్కువగా పండించే ఈ కివీ పంట రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. అలాగే మనూకా తేనెపై 66 శాతంగా ఉన్న సుంకాన్ని 5 సంవత్సరాల వ్యవధిలో 16.5 శాతానికి తగ్గించారు. యాపిల్ ఉత్పాదకత విషయానికొస్తే భారతదేశంలో హెక్టారుకు 7 నుండి 9 మెట్రిక్ టన్నులు ఉండగా, న్యూజిలాండ్‌లో దీనికి 6, 8 రెట్లు ఎక్కువ. అంటే హెక్టారుకు 50 నుండి 70 మెట్రిక్ టన్నులు. న్యూజిలాండ్‌లో సగటు వ్యవసాయ క్షేత్ర పరిమాణం 50 హెక్టార్లకు పైగా ఉంటుంది. అక్కడ కేవలం 1,200 నుండి 1,500 వ్యవసాయ క్షేత్రాలు మాత్రమే ఉన్నాయి, ఇవి ఏటా 5,65,000 మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో ప్రపంచంలో 15వ స్థానంలో ఉన్నాయి, దాదాపు ఉత్పత్తి అంతా ఎగుమతి అవుతుంది.

## నాగచైతన్యకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట.. అశ్లీల కంటెంట్ తొలగించాలని ఆదేశం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** నటుడు అక్కినేని నాగచైతన్యకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. తన పేరు, ఫొటో, కీర్తిని దుర్వినియోగం చేస్తూ ఆన్‌లైన్‌లో అశ్లీల, పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను ఏఐ ద్వారా సృష్టించిన నకిలీ చిత్రాలను వ్యాప్తి చేస్తున్నారని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు సానుకూలంగా స్పందించింది. ఇటువంటి కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గత 15 ఏళ్లుగా తెలుగు చిత్ర పరిశ్రమలో నటుడిగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగచైతన్య, తన వ్యక్తిత్వ హక్కులకు (పర్సనాలిటీ రైట్స్) భంగం కలుగుతోందని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కొన్ని అశ్లీల వెబ్‌సైట్లు తన పేరును ట్యాగ్‌లు, కేటగిరీలుగా వాడుకుంటూ అభ్యంతరకర కంటెంట్‌కు తప్పుడు ప్రచారం కల్పిస్తున్నాయని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనివల్ల తన పరువు, ప్రతిష్ఠలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితో పాటు తన అనుమతి లేకుండా తన ఫొటోలతో టీషర్టులు వంటి వస్తువులను (మెర్చండైజ్) ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారని కూడా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ జ్యోతి సింగ్ ధర్మాసనం, నాగచైతన్య వాదనలతో ఏకీభవించింది. నాగచైతన్య ప్రముఖ నటుడని, ఆయన కీర్తి, ప్రతిష్ఠలకు చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. "ఫిర్యాదుదారుడికి అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి ప్రాథమిక ఆధారాలున్నాయి. ఒకవేళ అలా చేయకపోతే, ఆయనకు పూడ్చలేని నష్టం జరుగుతుంది" అని కోర్టు తన తీర్పులో పేర్కొంది. ఈ మేరకు నాగచైతన్య పేరు, ఫొటో, వాయిస్ లేదా ఆయన వ్యక్తిత్వాన్ని సూచించే ఏ అంశాన్ని అయినా ఆయన అనుమతి లేకుండా వాణిజ్యపరంగా లేదా వ్యక్తిగతంగా ఉపయోగించరాదని ప్రతివాదులను ఆదేశించింది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌ఫేక్, ఫేస్ మార్ఫింగ్ వంటి టెక్నాలజీల ద్వారా కంటెంట్ సృష్టించడాన్ని నిషేధించింది. అభ్యంతరకర కంటెంట్ ఉన్న యూఆర్ఎల్‌లు, యూట్యూబ్ వీడియోలను 24 గంటల్లోగా తొలగించాలని సంబంధిత వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను సెప్టెంబరు 30కి వాయిదా వేసింది. ఇటీవల కాలంలో తమ వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం కోర్టును ఆశ్రయించిన ప్రముఖులలో అల్లు అర్జున్, నాగార్జున, గౌతమ్ గంభీర్, అభిషేక్ బచ్చన్ వంటి వారి సరసన నాగచైతన్య కూడా చేరారు.

## హైదరాబాద్‌లో జనసేన అధినేత పవన్ ఇంటి వద్ద హై టెన్షన్



**హైదరాబాద్‌లో, పతాకం న్యూస్:** తెలంగాణలో జనసేన అధినేత, ఎపి డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ తలపెట్టిన 'నవ నిర్మాణ సంకల్ప సభ' వ్యవహారం తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఈ సభ చుట్టూ నడుస్తున్న హైవోల్టేజ్ రాజకీయాల నేపథ్యంలో హైదరాబాద్‌లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. హైదరాబాద్ గచ్చిబౌలిలో జనసేన పార్టీ నిర్వహించాలనుకున్న 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ -- జనసేన సాధక్ సమ్మేళనం'కు సైబరాబాద్ పోలీసులు అనుమతి నిరాకరించారు. శాంతిభద్రతల సమస్యలు, ట్రాఫిక్ ఇబ్బందులను కారణంగా చూపుతూ పోలీసులు బ్రేక్ వేశారు. పోలీసుల నిర్ణయాన్ని సవాల్ చేస్తూ, సభకు అనుమతి ఇవ్వాలంటూ జనసేన లీగల్ సెల్ తెలంగాణ హైకోర్టులో అత్యవసరంగా హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు దానిని తిరస్కరించడంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు గట్టి చుక్కెదురైంది. మరోవైపు తెలంగాణ వాదులు రంగంలోకి దిగారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ప్రముఖ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ హైకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు. తమ వాదనలు వినకుండా సభపై ఎలాంటి ఏకపక్ష నిర్ణయం తీసుకోవద్దని వారు కోర్టును కోరారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజే ఆంధ్రాకు చెందిన నాయకుడు ఇక్కడ సభ పెట్టడం అంటే తెలంగాణ ఉద్యమాన్ని, రాష్ట్ర ఏర్పాటును కించపరచడమేనని, పవన్ సభలు ఏవైనా ఉంటే ఆయన స్వరాష్ట్రంలోనే చూసుకోవాలని వారు స్పష్టం చేశారు. హైకోర్టులో పిటిషన్ తిరస్కరణకు గురికావడం, మరోపక్క తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని పవన్ కల్యాణ్ నివాసం వద్ద ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారీ సంఖ్యలో పోలీసులు పవన్ ఇంటిని చుట్టుముట్టారు. ఎవరూ లోపలికి రాకుండా రహదారులపై బారికేడ్లు ఏర్పాటు చేసి టైట్ సెక్యూరిటీని అప్రమత్తం చేశారు. అటు జనసేన శ్రేణులు కూడా అలర్ట్ అయ్యాయి. ఉద్రిక్తతలను ముందే ఊహించిన పవన్ కల్యాణ్ వ్యక్తిగత రక్షణ కోసం భారీ సంఖ్యలో ప్రైవేట్ బౌన్సర్లను రంగంలోకి దించారు. పవన్ కల్యాణ్ సభ, తెలంగాణ పర్యటనపై టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే ఊరుకునేది లేదని, గత వ్యాఖ్యలపై పవన్ మొదట తెలంగాణ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రా నాయకులకు తెలంగాణ గడ్డపై ఏం పనని ప్రశ్నించిన ఆయన, అక్కడి నేతలు ఆంధ్రాలోనే రాజకీయం చేసుకోవాలని హితవు పలికారు. ఇక్కడ మనుగడ లేని పార్టీలు తెలంగాణలో ఎలా సక్సెస్ అవుతాయని ప్రశ్నించారు. తెలంగాణలో సొంతంగా ఎదిగే సత్తా లేక ఇతర పార్టీల అండతో పవన్ పాలిటిక్స్ చేస్తున్నారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. టీడీపీ, బీజేపీలకు తొత్తులుగా మారి.. ఆ పార్టీల డైరెక్షన్‌లో ఇక్కడకు వచ్చి పార్టీ నిర్మాణం చేస్తానంటే తెలంగాణ ప్రజలు అస్సలు ఒప్పుకోరని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును, ఇక్కడి ఉద్యమకారులను కించపరిచేలా వ్యవహరిస్తున్న జనసేన వైఖరిని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందని, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. పోలీసుల ఆంక్షలు, కోర్టు పరిణామాల నేపథ్యంలో పవన్ కల్యాణ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు.

## అమరావతిపై జగన్ వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యమైనవి: మంత్రి మండిపల్లి



**అమరావతి, పతాకం న్యూస్:** రాజధాని అమరావతిపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అనుసరిస్తున్న వైఖరిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాజధాని అమరావతిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. అమరావతి గురించి వైఎస్ జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యమైనవన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిని ఐదేళ్ల పాలనలో అల్లకల్లోలం చేసింది గత వైసీపీ ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు. రాజధాని నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపివేసి ఇప్పుడు అభివృద్ధిపై నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందంటూ జగన్ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టి.. ఇప్పుడు మావిగన్ అంటూ మాయ మాటలు చెప్తున్నారంటూ జగన్‌పై మంత్రి రాంప్రసాద్ రెడ్డి నిప్పులు చెరిగారు. అమరావతి రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది గత వైసీపీ పాలనలోనే అని విమర్శించారు. రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులు నిలిపి వేసి.. తద్వారా వేలాది కుటుంబాలను ఇబ్బందులకు గురి చేశారంటూ జగన్ తీరును మంత్రి మండిపల్లి తూర్పారబట్టారు. అమరావతికి భూములు ఇచ్చిన రైతుల విశ్వాసాన్ని దెబ్బతీశారంటూ ఆ పార్టీ అగ్రనేతలపై మంత్రి నిప్పులు చెరిగారు. ఐదేళ్లు అధికారంలో ఉండి రాజధాని అభివృద్ధికి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదన్నారు. ఇప్పుడు అమరావతిపై అసత్యాలు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారంటూ జగన్ వైఖరిని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వివరించారు.

(మొదటిపేజీ తరువాయి)

## పనిచేయకపోతే పక్కన పెట్టేస్తా: చంద్రబాబు



ఎన్డీఏ సమన్వయ కమిటీల నియామకం జరగనున్నట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో మిత్రపక్షాలను కలుపుకువెళ్లాలని.. బలం ఎక్కువా తక్కువా అనేది అనవసరమని, అటువంటి ఆలోచనలు కూడా పెట్టుకోవద్దన్నారు. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యేలకు సీఎం స్పష్టం చేశారు. జెండా మోయాలంటే జెండా ద్వారా వచ్చిన అధికారంలో కార్యకర్తలను భాగస్వామ్యులను చేయాల్సిందే అని చెప్పారు. పదవి ఎవరికీ శాశ్వతం కాదని.. పనిచేసినంత కాలం పదవికి ఢోకా ఉండదని సీఎం అన్నారు. పని చేయకపోతే నమస్కారం పెట్టి ఎటువంటి మొహమాటం లేకుండా పక్కనపెట్టేస్తానని తేల్చిచెప్పేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా భవిష్యత్తులో నష్టపోతామని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు గట్టిగా దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో, 'గొడ్డలి పార్టీ' విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, 'చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి' అంటూ ప్రత్యర్థి పార్టీని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమం పార్టీ భవిష్యత్ కార్యాచరణకు, ప్రభుత్వ పనితీరుకు అద్దం పట్టేలా సాగింది. ప్రతి 20-25 ఏళ్లకు ఒకసారి జరిగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ అత్యంత కీలకమని చంద్రబాబు ఉద్ఘాటించారు. "ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితానే పునాది. దీని ఆధారంగానే వ్యూహాలు, ప్రణాళికలు ఉంటాయి. జులై 14లోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ జరుగుతుంది. ఈ లోగా ఓట్ల చేర్పింపుల ప్రక్రియ పక్కాగా పూర్తి కావాలి. మన ఓట్లు ఉన్నాయా, లేవా అని నిరంతరం చూసుకోవాలి. ఎస్ఐఆర్‌ను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలి. ఈ ప్రక్రియను నేను ప్రతిరోజూ పర్యవేక్షిస్తాను" అని స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న ఏపీ ఓటర్లు తిరిగివచ్చి ఓటు వేయడం వల్లే కూటమి 164 స్థానాల్లో గెలిచిందని, ఈ స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ప్రతిపక్షంపై విరుచుకుపడుతూ చంద్రబాబు తీవ్ర పదజాలం ఉపయోగించారు. "చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి, లేకపోతే అది విషం చిమ్ముతుంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. గొడ్డలి పార్టీతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. నేను ఎన్నో పోరాటాలు చేశాను కానీ, ఇలాంటి నీచులతో ఎప్పుడూ చేయలేదు" అని అన్నారు. మెగా డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేశారని, గట్టిగా కౌంటర్ ఇవ్వగానే తోక ముడిచారని విమర్శించారు. నంద్యాలలో వైఎస్ విగ్రహం తలను వైసీపీ కార్యకర్తే తొలగించాడని, పోలీసులు వేగంగా స్పందించకుంటే ఆ నెపం టీడీపీపై నెట్టేవారని ఆరోపించారు. వివేకా హత్య కేసు ఒక కేస్ స్టడీ అని, ఇలాంటి కుట్రపూరిత రాజకీయాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రభుత్వంలోనే కాకుండా, పార్టీ కార్యక్రమాల్లోనూ మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలతో సంపూర్ణ సమన్వయం పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. "ఎన్నికలప్పుడు కలిసి, మిగతా రోజుల్లో పట్టించుకోకపోతే కుదరదు. ఎస్ఐఆర్ ప్రక్రియ మన సమన్వయానికి తొలి పరీక్ష. దీని కోసం మూడు పార్టీలతో కో-ఆర్డినేషన్ కమిటీ వేస్తాం. క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల మిత్రపక్షాలు లేకపోయినా, వారిని కలుపుకొని వెళ్లాలి. 2024 ఎన్నికల కంటే ఎక్కువగా వారితో కలిసి పనిచేయాలి. మిత్రధర్మాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్త పాటించాల్సిందే" అని ఆదేశించారు. కార్యకర్తల సంక్షేమం, సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. కార్యకర్తల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా, పిల్లల చదువు, నైపుణ్య శిక్షణ వంటి కార్యక్రమాలను వివరించారు. తాను అనుచరులను కాదని, సమర్థవంతమైన నాయకులను కోరుకుంటానని, అలాంటి నాయకత్వమే పార్టీకి బలమని అన్నారు. "జులై 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు 45 రోజుల పాటు ఇంటింటి ప్రచారం చేపడతాం. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిద్దాం. ఈ ప్రచారంలో నేను కూడా పాల్గొంటాను. అందరం సైకిళ్లపై, వీలైతే ఈ-సైకిళ్లపై వెళ్లి ప్రజలను కలుద్దాం" అని పిలుపునిచ్చారు. పోలవరం ప్రాజెక్టును తిరిగి గాడిన పెట్టామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో రాష్ట్రాభివృద్ధికి బాటలు వేశామని, ఈ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. నామినేటెడ్ పదవుల్లోనూ సామాజిక న్యాయం పాటిస్తామన్నారు.

## ఏపీలోని పలు జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం

ఎండలు, గాలిలో తేమ లేకపోవడంతోపాటు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అలాంటి వేళ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు మెరుపులతోపాటు పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. విశాఖపట్నం, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, పార్వతీపురం మన్యం, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు విజయనగరం, విశాఖపట్నం, మన్యం అల్లూరి, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్, అనకాపల్లితోపాటు ఉభయ గోదావరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. దీంతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు స్పష్టం చేసింది.

# కోటి సంతకాలతో మెడికల్ కళాశాలలు పీపీపీ విధానాన్ని అడ్డుకుందాం



**అనంతగిరి, పతాకం న్యూస్:** మండలంలోని గరుగుబిల్లి పంచాయతీ సింగవరం రెవెన్యూ సర్వే నంబర్ 22లోని సుమారు 942 ఎకరాల భూములకు సంబంధించి అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదం నెలకొన్న దృష్ట్యా ఆ రెండు శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. ఈ భూములకు సంబంధించి జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు, మాజీ సైనికుడు పిన్నింటి వెంకటేశ్వరరావు ఇటీవల మండల కేంద్రంలోని పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ టి.నిషాంతికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం తహశీల్దార్ ఎం.వీరభద్రాచారి, అటవీశాఖ రేంజర్ రవికుమార్ సిబ్బందితో కలిసి సింగవరం రెవెన్యూలోని 22 సర్వే నంబరులో గల సుమారు 942 ఎకరాల భూములకు సంబంధించి రికార్డులు, హద్దులను పరిశీలించారు. నివేదికలను వేర్వేరుగా ఉన్నతాధికారులకు పంపించనున్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ 1960లోనే సెటిల్మెంట్ రికార్డు ప్రకారం భూములు రెవెన్యూకు చెందినవేనని, ఏళ్లుగా సాగులో గిరిజనులు ఉన్నారని, జాయింట్ సర్వే నివేదికలను త్వరగా పంపించి ఇప్పటికైనా భూముల వివాదాన్ని ఓ కొలిక్కి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ తేజశ్వరరావు, ఎంపీటీసీ తౌటినాయుడు, వీఆర్వో కోటిబాబు, అటవీశాఖ సెక్షన్ అధికారి పాపారావు, జగదీశ్ పాల్గొన్నారు.

## దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఆరంభం




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలకు రైల్వే ఉన్నతాధికారులు శ్రీకారం చుట్టారు. దీంతో దాదాపు నాలుగు దశాబ్దాల నాటిమాట ఇప్పటికి నెరవేరినట్టయింది. పూర్తిస్థాయి కార్యకలాపాలు సాగించడం కోసం ఇంకా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. విశాఖ నగరంలోని సిరిపురం జంక్షన్ వద్దగల వీఎంఆర్డీఏ డెక్ భవనం ఆరో అంతస్తులో జోన్ ప్రధాన కార్యాలయాన్ని ఆరంభించారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్, ముఖ్య ప్రజా సంబంధాల అధికారి వై.బాలాజీ కిరణ్, చీఫ్ పర్సనల్ ఆఫీసర్ ఎల్వీఎస్ఎస్.ప్రాతుడు, ముఖ్య ఆర్థిక సలహాదారు పి.హరిప్రసాద్, ముఖ్య వాణిజ్య అధికారి (కోఆర్డినేషన్) డి.సత్యనారాయణ, ముఖ్య మెకానికల్ అధికారి డాక్టర్ అమిత్ గుప్తా తదితరులు హాజరయ్యారు. జోన్ కార్యకలాపాల ప్రారంభం సందర్భంగా సిబ్బంది స్వీట్లు పంచిపెట్టారు. రామ్మోహన్ నాయుడు విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఇచ్ఛాపురం సరిహద్దు ప్రాంతమైన ఎ.ఎస్ పేట సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద సౌత్ కోస్ట్ రైల్వే జోన్ బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారిక పరిపాలన నేటి నుంచి ప్రారంభమైందని వెల్లడించారు. విశాఖ రైల్వే జోన్ సాధన కోసం 12 ఏళ్లుగా సాగించిన సుదీర్ఘ పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రజా ఉద్యమాల ఫలితమే 1990వ దశకం నుంచీ అనేక ప్రజా ఉద్యమాల ఫలితంగా జోన్ కల సాకారమైంది. భువనేశ్వర్ కేంద్రంగా జోన్ ఇప్పటివరకూ ఉండగా తాజా ప్రక్రియతో విశాఖకు మారింది. 2014 విభజన చట్టంలోనూ రైల్వేజోన్ హామీ ఉంది. 2017కు ముందు నుంచి ప్రధాని మోడీ రైల్వేజోన్ విశాఖకు వస్తుందంటూ ఊరిస్తూనే వచ్చారు. ఈ ఏడాది జనవరి 8న జోన్ కు ఆయన వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. సుమారు 3501 కిలోమీటర్ల పరిధిలో 385 రైల్వేస్టేషన్లు ఈ జోన్ లో ఉంటాయి. 17 వేల మంది సిబ్బంది ఉండనున్నారు. ఏటా రూ.17300 కోట్లు ఆదాయ అంచనాతో ఈ జోన్ ఏర్పాటైంది. దేశంలో ఇది 18వ రైల్వేజోన్. దీనిపై ఈ ఏడాది మే 5న రైల్వే బోర్డు గెజిట్ను విడుదల చేస్తూ రూ.170 కోట్లకు అనుమతులిచ్చింది. ఈ జోన్ పరిధిలో విశాఖపట్నం, గుంటూరు, గుంతకల్లు, విజయవాడ డివిజన్లు ఉంటాయి. అయితే అధికారికంగా రైల్వే నుంచి మీడియాకు ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా రహస్యంగా జోన్ కార్యకలాపాల ఆరంభ కార్యక్రమాన్ని నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

## ఇంటి పన్నుల వసూళ్లలో దూకుడు



**పాడేరు, పతాకం న్యూస్:** ఇంటి పన్నుల వసూళ్లలో జిల్లా దూసుకుపోతోంది. పంచాయతీలకు ఇంటి పన్నులు ప్రధాన ఆదాయం. ఈ క్రమంలో వాటి వసూళ్లకు పంచాయతీ అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రభుత్వం సైతం ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, లక్ష్యం మేరకు వసూలు చేయాలని ఆదేశిస్తున్నది. దీంతో రంగంలోకి దిగిన పంచాయతీ అధికారులు తమ సిబ్బందిని ఇంటింటికీ పంపి మరీ పన్నులను వసూలు చేశారు. ఫలితంగా జిల్లాలో లక్ష్యం మేరకు ఇంటి పన్నులను వసూలు చేయగలిగారు. జిల్లాలో మొత్తం లక్షా 52 వేల 926 నివాసాలకు గాను రూ.8 కోట్ల 39 లక్షలు ఇంటి పన్నుగా వసూలు చేయాలనే లక్ష్యంతో అధికారులు చర్యలు చేపట్టి, రూ.6 కోట్ల 48 లక్షలు వసూలు చేశారు. ఇంకా పెండింగ్లో రూ.1.86 కోట్లు ఉంది. అయితే ఆ మొత్తం గత కొన్నాళ్లుగా ప్రభుత్వ సంస్థల నుంచి పంచాయతీలకు రావాల్సిన ఇంటి పన్నులు. వాస్తవానికి ప్రభుత్వ సంస్థల నుంచి రావాల్సింది మినహాయిస్తే లక్ష్యం మేరకు ఇంటి పన్నుల వసూలు పూర్తయిందని అధికారులు అంటున్నారు. అందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని జిల్లా పంచాయతీ అధికారి కేపీ చంద్రశేఖర్ అభినందించారు. ఇంటి పన్నుల చెల్లింపుల విషయంలో ప్రజలు ముందుండాలని పేర్కొనే ప్రభుత్వం, ఆయా శాఖలకు సంబంధించిన ఇంటి పన్నుల చెల్లింపుల విషయంలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించడం గమనార్హం. పాడేరు, అరకులోయ, చింతపల్లి వంటి ప్రాంతాల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యాలయాలు, ఇతర భవనాలకు సంబంధించిన ఇంటి పన్నులను గత కొన్నాళ్లుగా పంచాయతీలకు చెల్లించడం లేదు. దీంతో ప్రస్తుతం జిల్లాలో ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన బకాయి ఇంటి పన్నులే రూ.1.86 కోట్లు ఉంది. అయితే ప్రజల నుంచి ముక్కుపిండి ఇంటి పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ అధికారులు ప్రభుత్వ శాఖల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం గమనార్హం. అలాగే ప్రభుత్వ బకాయిలు లేని పెదబయలు, ముంచంగిపుట్టు, కొయ్యూరు, హుకుంపేట, డుంబ్రిగుడ, జీకేవీధి, జి.మాడుగుల అనంతగిరి మండలాల్లో ఇంటి పన్నుల వసూళ్లలో శత శాతం లక్ష్యం సాధించగా, ప్రభుత్వ బకాయిలున్న కారణంగానే పాడేరు, చింతపల్లి, అరకులోయల్లో లక్ష్యాన్ని చేరలేకపోయారని తెలుస్తున్నది.

## సస్టైనబుల్ క్యాంపస్ ఇంపాక్ట్ జాతీయ సదస్సులో మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలకు జాతీయ స్థాయిలో ప్లాటినం అవార్డు









**మల్కాపురం, పతాకం న్యూస్:** భారత ఎన్విరాన్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలిలో గల శాంతి సరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో జరిగిన సస్టైనబుల్ క్యాంపస్ ఇంపాక్ట్ జాతీయ సదస్సులో స్థానిక మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ కళాశాలకు జాతీయ స్థాయిలో ప్లాటినం అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన దాదాపు 1000 కి పైగా ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమానికి అతిధులుగా నీతి ఆయోగ్ సభ్యులు విజయ్ సారస్వత్, రక్షణ శాఖ సలహాదారు సతీష్ రెడ్డి, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య బాలకృష్ణ రెడ్డి, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ మాజీ చైర్మన్ ఆచార్య టీ.జీ.సీతారాం, లోక్ సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ, ప్రముఖ పర్యావరణ ఉద్యమకారులు ఆచార్య పురుషోత్తం రెడ్డి, రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ నాగేంద్ర తదితర ప్రముఖులు పాల్గొని, ప్రసంగించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేసిన ఉన్నత విద్యాసంస్థలకు ప్లాటినం,గోల్డ్,సిల్వర్ అనే మూడు కేటగిరీల్లో అవార్డులను అందజేశారు. ఈ అవార్డులలో ప్లాటినం అవార్డులు అత్యుత్తమమైనవి. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలకు ఆ ప్లాటినం అవార్డు లభించింది. ఈ అవార్డును సీనియర్ అధ్యాపకులు, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయదేవి కళాశాల తరఫున స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల డిగ్రీ ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ క్యాస్లిన్ హర్షం వ్యక్తం చేశారు. కళాశాలలోని అధ్యాపకులు, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు, విద్యార్థులు అందరూ కలసి ఈ విజయాన్ని సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యాన్ని, అధ్యాపకులను, విద్యార్థులను ఉన్నత విద్యాశాఖ అధికారులు అభినందించారు.


## కలగానే వంతెన నిర్మాణం



**అనంతగిరి, పతాకం న్యూస్:** దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వని చందంగా ఉంది రామచంద్రపురం గిరిజనుల పరిస్థితి. మండలంలోని భీంపోల్ పంచాయతీ శివారులో ఉన్న రామచంద్రపురం గెడ్డపై వంతెన నిర్మాణానికి 2022లో గత ప్రభుత్వం సుమారు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. అయితే ఐదుసార్లు వంతెన నిర్మాణానికి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకురాలేదు. గడువులోగా పనులు ప్రారంభంకాకపోవడంతో నిధులు మురిగిపోయాయి. దీంతో పలు గ్రామాల గిరిజనులకు నిరాశే ఎదురైంది. రామచంద్రపురం గెడ్డ మీదుగా సరియాపల్లి, రామచంద్రపురం, రాళ్లగెడ్డ గ్రామాలతో పాటు గుమ్మకోట పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాలు పడినప్పుడు ఈ గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ సమయంలో గిరిజనులు ప్రాణాలకు తెగించి రాకపోకలు సాగిస్తుంటారు. గత ఏడాది నిండు గర్భిణిని కుటుంబ సభ్యులు రామచంద్రపురం గెడ్డ దాటించి భీమవరం పీహెచ్సీకి తరలించారు. ప్రసవం అనంతరం స్వగ్రామానికి తరలించే క్రమంలో అతికష్టమ్మీద బాలింతను, తల్లిని గెడ్డ దాటించి స్వగ్రామమైన రామచంద్రపురం తీసుకువచ్చారు. ఇలాంటి సంఘటనలు గతంలో ఎన్నో చోటుచేసుకున్నాయి. ఈ గెడ్డపై వంతెన నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదనలు ఉన్నాయి. కాగా 2022లో గత ప్రభుత్వం సుమారు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో గిరిజన సంక్షేమశాఖ అధికారులు వంతెన నిర్మాణానికి ఐదుసార్లు టెండర్లు పిలిచారు. అయితే గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేయదని తెలిసి కాంట్రాక్టర్లు ముందుకురాలేదు. గడువులోగా పనులు ప్రారంభంకాకపోవడంతో ఆ నిధులు మురిగిపోయాయి. నిధులు మంజూరు కావడంతో వంతెన నిర్మాణం పూర్తవుతుందని ఆశ పడ్డ గిరిజనులకు నిరాశే మిగిలింది. తమకు ఎన్నాళ్లీ కష్టాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పైడిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు





**పెందుర్తి, పతాకం న్యూస్:** పెందుర్తి నియోజకవర్గం జీవీఎంసీ 88 వ వార్డు కోట నరవ గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ పైడిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు అమ్మవారి యొక్క తీర్థ ప్రసాదాలను స్వీకరించారు ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుని ఆలయ కమిటీ సభ్యులు కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ అమ్మదయతో నియోజవర్గం లోని ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ యొక్క కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఇందాల రమణ , వార్డు అధ్యక్షులు ఒబ్బిన జనార్ధన శ్రీకాంత్ , పెందుర్తి ఏ ఎమ్ సి డైరెక్టర్ గల్లా శ్రీనివాసరావు , మాజీ ఎంపీటీసీ ఎల్లాపు శ్రీనివాసరావు , గవర సత్తిబాబు , రాపర్తి కిషోర్ ,సూరిబాబు, అప్పలరాజు , ఈశ్వర్ రావు, ముత్త అర్జున్, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు సరగడం సింధు, కర్రీ కోటి, రాజు, మహేష్, నరేష్ , గణేష్ , తాత బాబు , రమేష్, మల్లి, నూకరాజు, శ్రీను, అనిల్ తదితరులు ఈ యొక్క కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి యొక్క తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## ఎస్టీ నాయక్ కుల ధ్రువీకరణ పత్రాల జారీకి గ్రీన్ సిగ్నల్


**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో ఎస్టీ నాయక్లకు కుల ధ్రువీకరణ పత్రాల జారీకి అవకాశం కల్పిస్తున్నామని జాయింట్ కలెక్టర్ టి.శ్రీపూజ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 8,883 ఎస్టీ నాయక్ తెగకు చెందిన గిరిజన కుటుంబాలున్నాయని, వారికి ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు లేవని గుర్తించామన్నారు. ఈ క్రమంలో వారికి మొదటి విడత జూన్లో, రెండో విడత జూలైలో కుల ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తామన్నారు. ఆయా తెగలకు చెందిన వారంతా తమ వద్ద ఉన్న ఆధారాలతో తమ పరిధిలోని సచివాలయంలో కుల ధ్రువీకరణకు దరఖాస్తులు చేసుకోవాలని జేసీ సూచించారు. కుల ధ్రువీకరణకు సమర్పించిన దరఖాస్తులు అన్ని స్థాయిల్లో పరిశీలన జరిపి ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తామని ఒక ప్రకటనలో ఆమె తెలిపారు.

## హైదరాబాద్ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలి

### సమైక్యాంధ్ర జేఏసీ నాయకుడు రాజు గౌడ్ యాత డిమాండ్

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** హైదరాబాదులో జనసేన పవన్ కళ్యాణ్ సభని అడ్డుకోవడం దుర్మార్గం.. దీనిని ఖండిస్తున్నాను అని సమైక్యాంధ్ర జేఏసీ నాయకుడు రాజు గౌడ్ యాత తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సోనియా గాంధీ,రాహుల్ గాంధీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయం చేశారు.... తల లేని మొండాన్ని... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ప్రకటించారు.. బిజెపి ప్రభుత్వం మోడీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తగు న్యాయం చేయాలి... తెలంగాణలోని కొందరు అమ్ముడుపోయిన నాయకులు ఆంధ్రప్రదేశ్ పౌరుల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు దీనిపై వెంటనే కేంద్రం సుప్రీంకోర్టు న్యాయమూర్తి తే దర్యాప్తు చేయాలి. ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని చులకన చేసి మాట్లాడడం తప్పు.. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరునికి దేశంలో ఎక్కడైనా స్వేచ్ఛగా బ్రతికే హక్కు స్వేచ్ఛగా మాట్లాడే హక్కు ఉంది రాష్ట్రాలతో సంబంధం లేదు.. కానీ తెలంగాణలో కొంత మంది కావాలని తెలంగాణ వాదం పేరుతో ఆంధ్ర ప్రదేశ్ ప్రజలని అనుకుదొక్కుతున్నారు. నాయకులను చులకన చేసి మాట్లాడుతున్నారు దీనిని సమైక్యాంధ్ర జేఏసీ ఖండిస్తుంది. జనసేన పవన్ కళ్యాణ్ సభని అడ్డుకోవడం సిగ్గుచేటు దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## ముందుకు సాగని రహదారి పనులు..



**పాతపట్నం, పతాకం న్యూస్:** మండలంలోని తిడ్డిమి పంచాయతీ పరిధిలో గల బైరాగిపేట నుంచి దశరథపురం మీదుగా చంగుడి వరకు రహదారి పనులు బిల్లులు కాకపోవడంతో ముందుకు సాగడంలేదు. గత ప్రభుత్వం ప్రారంభించిన రహదారి పనులు నిలిచి పోవడంతో రాళ్లు తేలడం వల్ల వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో దృష్టిసారించింది. బైరాగి పేట నుంచి దశరథపురం మీదుగా చంగుడి వరకు రహదారి పనులు సుమారు రూ.లక్షా70వేలతో ప్రారంభించి సుమారు ఏడాది గడుస్తోంది. అయితే పనులు పూర్తికాకపోవడంతో గులకరాళ్లు తేలడం వల్ల ఆ రహదారిలో వాహనచోదకులు అగచాట్లకు గురవుతున్నారు. రోడ్డుపై మెటల్ తేలడంతో ద్విచక్రవాహనాలు జారిపడే ప్రమాదముందని పలువురు చెబుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైతే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశమెందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, కొద్దిరోజుల్లో పనులు ప్రారంభించనున్నామని పీఆర్ ఏఈ మోహనరావు తెలిపారు.

## పర్యావరణాన్ని పరిరక్షించాలి: అచ్చెన్నాయుడు



**కోటబొమ్మాళి, పతాకం న్యూస్:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రకృతి సంరక్షణ ద్వారానే భావితరాలకు మెరుగైన భవిష్యత్‌ను అందించగల మని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. నిమ్మాడ తన క్యాం పు కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ఏపీ పీసీబీ శ్రీకాకుళం ప్రాంతీయకార్యాలయంలో ఆధ్వర్యంలో ఈనెల ఐదోతేదీ వరకు నిర్వహిం చనున్న పర్యావరణ అవగాహన కార్యక్రమాలకు సంబందించిన గోడపత్రికను ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీ పీసీబీ చైర్మన్ పి.కృష్ణయ్య ఆదేశాల మేరకు జిల్లాలో వ్యర్థాలతో సంపద ప్రదర్శనలు, జ్యూట్ బ్యాగుల పంపిణీ, మొక్కల నాటడం, నాగావళి నది శుభ్రత కార్యక్ర మాలు, మానవహారం, వీధి నాటికలు, అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామని జిల్లా పర్యావరణ ఇంజనీర్ కరుణశ్రీ మంత్రికి వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## విమ్స్‌ను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చేందుకు కృషి

### నూతన డైరెక్టర్ డాక్టర్ వి.మన్మథరావు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విమ్స్‌ను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని నూతన డైరెక్టర్ డాక్టర్ వి.మన్మథరావు పేర్కొన్నారు. విమ్స్ డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆస్పత్రిలో పీజీ కళాశాల, క్యాథలాబ్ ఏర్పాటు సహా గత డైరెక్టర్ కె.రాంబాబు పలు ప్రతిపాదనలు పెట్టారని, వాటిని ముందుకు తీసుకువెళ్లడం ద్వారా రోగులకు నాణ్యమైన సేవలను అందించేందుకు కృషి చేయనున్నట్టు చెప్పారు. ఆస్పత్రికి నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఫార్మసిస్టులు వంటి పోస్టుల మంజూరు కోసం యత్నిస్తానన్నారు. విమ్స్ అభివృద్ధి చెందుతున్న దశలో ఉందని, కీలక ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేలా కృషిచేస్తానన్నారు. ఇందుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులతోపాటు అందరి సహకారం కావాలన్నారు. వైద్యులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేయడం వల్ల ఆస్పత్రి మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. హైదరాబాద్‌లో ఉన్న నిమ్స్ తరహాలో సేవలు అందించే ఉద్దేశంతో విమ్స్‌ను ఏర్పాటు చేశారని, ఆ దిశగా ముందుకు తీసుకువెళతామన్నారు. తనకు డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ప్రభుత్వానికి, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు, వైద్య, ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి సౌరబ్ గౌర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరికీ అందుబాటులో ఉంటూ విమ్స్‌ను అభివృద్ధి దిశగా నడిపించేందుకు కృషిచేస్తానని మన్మథరావు స్పష్టం చేశారు. సమావేశంలో ఆస్పత్రి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస కుమార్, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ మనోజ్, ఆర్ఎంవో డాక్టర్ శిరీష పాల్గొన్నారు. అంతకుముందు తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన మన్మథరావును పలువురు సీనియర్ వైద్యులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వీరిలో మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి, కేజీహెచ్ జనరల్ మెడిసిన్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ వాసవీ లత, జనరల్ సర్జరీ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ వి,రాజ్‌కమల్‌తోపాటు పలువురు వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బంది ఉన్నారు.

# పెట్రోలు, డీజిల్ పై వేస్తున్న పనులను రద్దు చేయాలి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** సిపిఐ జిల్లా ఆఫీసులో విశాఖ జిల్లా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారంజరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్.రహీమాన్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం. జగ్గు నాయుడు పాల్గొని మాట్లాడుతూ ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా దాడులు నెపంతో దేశంలో ఎన్నడూ లేని విధంగా నరేంద్ర మోడీ భారతదేశంలో ఆయిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఎవరు భయపడక్కర్లేదు చెప్పి తెలంగాణ రాష్ట్రానికి వెళ్లి వచ్చిన తర్వాత సంవత్సరం దాకా బంగారం కొనుగోలు చేయొద్దని ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలని వర్క్ ఫర్ హోమ్ అని, మన దేశంలో ఉత్పత్తి అవుతున్న వస్తువులను కొనుగోలు చేయాలని చెప్పి 15 నుండి 25వ తేదీ లోపు పెట్రోల్, డీజిలు సిఎన్జి గ్యాస్‌పై 8,ూపాయలు వంట గ్యాస్ పై 60రూపాయలు వాణిజ్య సిలిండర్‌పై 1500, రూపాయలు పెంచడం వల్ల ప్రజల నడ్డి విరిచే విధంగా ఉన్నాయని అన్నారు . పెట్రోల్ డీజిల్ పై వేస్తున్న పన్నులను రద్దు చేయాలని భారీగా పెంచిన వాణిజ్య సిలిండర్ గ్యాస్ పై వంటగ్యాస్‌పై పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కాకినాడలో కేజీ బేసిన్ నుండి లభ్యమవుతున్న క్రూడాయిల్ నాచురల్ గ్యాస్ 12,వ ఆర్థిక సంఘం సిఫార్సుకు అనుగుణంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి 50% వాటాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు జిల్లా వ్యాప్తంగా 1,వతేదీ నుండి 9,వ తేదీ వరకు యుద్ధం పేరుతో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న ఆర్థిక భారాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లడం జరుగుతుందని అన్నారు . ఈనెల 6న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సెమినార్, 9న రాస్తారోకోలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజా పోరు కె.దేవా, ఎం సి పి ఐ పట్నాయక్, జీవీఎం. రెడ్డి సిపిఐ సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్ కార్యవర్గ సభ్యులు ఎం. మన్మధరావు బి.ఈశ్వరమ్మ ఎన్. నాగభూషణరావు, పద్మ సిహెచ్. బుజ్జి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు

## పగలు స్టీల్ వ్యాపారం.. రాత్రుళ్లు దొంగతనాలు

### అంతరాష్ట్ర ముఠాను అరెస్టు చేసిన పోలీసులు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో కొంతకాలంగా ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను జిల్లా పోలీసులు అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. పక్కా వ్యూహంతో వలపన్ని ఇద్దరు కేటుగాళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.80 లక్షల చోరీ సొత్తును (బంగారం, వెండి, నగదు) స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ వివరాల మేరకు.. పశ్చిబెంగాల్ రాష్ట్రం మాల్దా జిల్లా ఇంగ్లీష్ బజార్ పరిధికి చెందిన మహమ్మద్ మీజాన్ (36), మహమ్మద్ హసన్ (26) పగటిపూట ఊళ్లలో స్టీల్ సామాన్లు అమ్మే వ్యాపారులుగా అవతారం ఎత్తి కాలనీలన్నీ తిరుగుతారు. తాళం వేసి ఉన్న ఇళ్లను పసిగట్టి పక్కాగా రెక్కీ నిర్వహిస్తారు. ఆ తర్వాత చీకటి పడ్డాక గుట్టుచప్పుడు కాకుండా అదే ఇళ్లపై పడి దోచుకెళ్తుంటారు. మీజాన్‌పై జిల్లాలో ఏడు, విజయనగరంలో ఏడు, విశాఖపట్నంలో రెండు చొప్పున మొత్తం 16 కేసులు ఉన్నాయి. జైలు జీవితం గడిపి గతేడాది అక్టోబర్‌లో బయటకు వచ్చాడు. ఇతడు రాష్ట్ర పోలీసుల నిఘా నుంచి తప్పించుకొనేందుకు ఒడిశాలోని బరంపురంలో మకాం వేశాడు. అక్కడ నుంచి తన అనుచరుడు హసన్‌ను వెంటబెట్టుకొని గత మూడు నాలుగు నెలల్లో శ్రీకాకుళం, మన్యం జిల్లాలో ఆరు కొత్త దొంగతనాలకు (కాశీబుగ్గలో మూడు, టెక్కలి, పార్వతీపురం బరంపురంలో ఒక్కొక్కటి) పాల్పడ్డాడు. గతనెల 25న టెక్కలి పరిధిలో భారీ చోరీ జరిగింది. 19 కిలోల వెండి, 50 గ్రాములు బంగారం, లక్ష నగదు అపహరణకు గురైంది. వీటి విలువ రూ.69 లక్షలు. ఈ కేసును పోలీసులు సవాల్‌గా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కాశీబుగ్గ ఎస్‌హెచ్‌వోకు వచ్చిన పక్కా సమాచారంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. పలాస మండలం గరుడఖడి జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిలో దొంగలు దాక్కున్నారని తెలుసుకొని మెరుపుదాడి చేసి మీజాన్, హసన్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి 20 కిలోల 349 గ్రాముల వెండి (విలువ రూ.60 లక్షలు). 12 తులాల బంగారం (విలువ రూ.18 లక్షలు), రూ.లక్షల విలువైన మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిని పట్టుకున్న అదనపు ఎస్పీ (క్రైం) పి.శ్రీనివాసరావు, కాశీబుగ్గ డీఎస్పీ టి.భవానీ, సీఐ వై.రామకృష్ణ, ఎస్ఐ ఎన్.సునీల్ బృందాన్ని ఎస్పీ అభినందించారు. హెడ్ కానిస్టేబుల్ టి.భాస్కరరావు, కానిస్టేబుళ్లు ఉషాకిరణ్, నీలకంఠం, రాధాకృష్ణ, ఉమామహేశ్వరరావు, సీసీఎస్ కానిస్టేబుల్ అలీ సేవలను కొనియాడారు.

## యువకులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి: మంత్రి శ్రీనివాస్



**బొండపల్లి, పతాకం న్యూస్:** పల్లెల్లో ప్రతి యువకుడు పారిశ్రామికవేత్తగా ఎదగాలని ముఖ్యమం త్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు పనిచేస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొండకిండాం రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కును ఆయన పరిశీలించి.. పురోగతిపై అధికారులతో సమీక్షించారు. సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ఈ ఎంఎస్ఎంఈ పార్కును తొలివిడత 26 ఎకరాల్లో చేపట్టిన పారిశ్రామిక ముఖ చిత్రాన్ని పరిశీలించారు. నేల చదును, అంతర్గత రహదారుల ఏర్పాటు, విద్యుత్, నీటి సరఫరా తదితర సదుపాయాల కల్పనను అధికా రులను అడిగి తెలుసుకున్నారు. పార్కుల బ్లాక్‌సైజు, పారిశ్రామిక వేత్తలకు భూ కేటాయింపుల వివరాలపై చర్చించి.. పలు సూచనలు చేశారు. ఆసక్తి ఉన్న స్థానిక పారిశ్రామికవేత్తలు, వ్యాపా రులు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక తో ఏపీఎంఎస్ఎంఈ డవలప్ మెంట్ పోర్టల్ ద్వారా దరఖా స్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వి.కృష్ణప్రసాద్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కరుణాకర్, జేఈఈ రాజేష్, తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, సీఐ సన్యాసినాయుడుతోపాటు గజపతినగరం జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రాపు సురేష్, పార్టీ మండల అధ్యక్షుడు రాపాక అచ్చంనాయుడు, మాజీ జడ్పీటీసీ బండారు బాలాజీ, టీడీపీ మహిళా అధ్యక్షురాలు ముంజేటి పార్వ తి, నంబూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీరందించి ఆదుకోండి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, తక్షణం తగు చర్య లు తీసుకుని ఆదుకోవాలని ఆబోతులపేట గ్రామ మహిళలు కోరారు. ఈ మేరకు పింఛన్ల పంపిణీకి వచ్చిన ఎమ్మెల్యే నడు కుదిటి ఈశ్వరరావును గ్రామస్థులు సమస్యలు విన్నవించారు. తాగు నీటి ఎద్దడితో అవస్థలు పడుతున్నామని, కాలువల్లో పూడికలో తీయడం లేదని, దీంతో దుర్గంధం వెద జల్లుతోందని, రోడ్లు పాడయ్యాయని, వీధిలైట్లు లేక చీకటిలో రాకపో కలకు ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే ఎన్ఈ ఆర్ తాగునీటి సరఫరా చేపట్టాలని సంబంధిత అధి కారులకు ఫోన్‌లో సూచించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు ఉన్నా ఎందుకు పనులు ప్రారం భించలేదని పీఆర్ ఏఈని ప్రశ్నించారు. తక్షణం తగు చర్యలు చేపట్టాలన్నారు. కాలువ ల్లోని పూడికతీత చేపట్టి పారిశుధ్య పనులు చేప ట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే క్షమించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, వజ్జపర్తి రఘురాం, టంకాల మౌళీశ్వరరావు, బూరాడ వెంకటరమణ, నక్క మురళి, బెవర జగన్నాథరావు, పొగిరి నారాయణరావు, బి.అప్పల నాయుడు, కూనుబిల్లి కూర్మారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బొబ్బిలి ఐటీఐకి కేంద్రం ప్రత్యేక గుర్తింపు



**బొబ్బిలి, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సేతు పథకానికి బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐ ఎంపికైంది. దీంతో ఇక్కడ విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్య అందించేందుకు మార్గం సుగమమైంది. దేశంలో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన యువతను తయారుచేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఐటీఐల ఆభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందు లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని 83 ప్రభుత్వ ఐటీఐలను పీఎం సేతు పథకానికి ఎంపిక చేయగా అందులో బొబ్బిలికి చోటు దక్కింది. ఈ పథకం ద్వారా ఐటీఐలో నూతన భవనాల నిర్మాణం, ఆధునిక ల్యాబ్‌లు, సాంకేతిక పరికరాలు, మెరుగైన వసతులు ఏర్పాటుకానున్నాయి. అలాగే పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త ట్రేడ్లు, కోర్సులను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దీంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు అత్యధునిక సాంకేతిక శిక్షణ పొందే అవకాశాలు అధికంగా ఉన్నాయి. స్థానిక ఐటీఐని పీఎం సేతు ప?థకంలో చేర్చినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## ఇంట్లో గ్యాస్ పేలి పది మందికి గాయాలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఉత్తర ఢిల్లీలో ముకుందపూర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో గ్యాస్ పేలి ఇల్లు కూలి పదిమందికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘటనలో పదిమందికి గాయాలయ్యాయి. క్షతగ్రాతుల్ని బాబు జగ్జీవన్‌రామ్ మెమోరియల్ ఆసుపత్రికి, డాక్టర్ బాబా సాహెబ్ అబేద్కర్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించాము. రెస్క్యూ ఆపరేషన్స్ కొనసాగుతున్నాయి అని పేర్కొంది. ఇక గాలింపు చర్యల్లో సహాయపడడానికి జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్ఎస్), డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అలాగే సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ పేలుడు వల్ల సుమారు 250 చదరపు గజాల విస్తీర్ణం గల ఒక అంతస్తు ఇల్లు కూలిపోయిందని పోలీసులు వెల్లడించారు.

# నవజాత శిశువులకు అందుబాటులోకి రాని ఎన్టీఆర్ బేబీ కిట్లు




**చింతపల్లి, పతాకం న్యూస్:** ప్రభుత్వాస్పత్రిలో పుట్టిన నవజాత శిశువులకు ఇప్పటికీ ఎన్టీఆర్ బేబీ కిట్లు అందడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుగార్చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పథకాన్ని పునరుద్ధరిస్తూ రూ.51.14 కోట్ల నిధులను కేటాయించి 2025 మే 19న జీవో నంబరు 61 విడుదల చేసింది. ఆస్పత్రిలో ప్రసవం పొందిన తల్లులకు నవజాత శిశువుల సంరక్షణకు అవసరమైన రూ.1,410 విలువైన సామగ్రిని కిట్ ద్వారా అందజేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అయితే జీవో విడుదల చేసి ఏడాది గడిచినా ఈ పథకం ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో బాలింతలు శిశువుల సంరక్షణకు అవస్థలు పడుతున్నారు.

నవజాత శిశువుకి ఏడాది వయస్సు వచ్చే వరకు ప్రత్యేక శ్రద్ధతో సంరక్షించాలి. శిశువుకి వెచ్చదనం ఇవ్వాలి. దీని కోసం శిశువుల బెడ్‌ను ఉపయోగించాలి. శిశువులకు వేసే దుస్తులు, టవెల్స్, ఆయిల్, సబ్బు, షాంపూ ప్రత్యేకంగా ఉండాలి. ఈ విధంగా శిశువులను సంరక్షించడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండడంతో పాటు శిశు మరణాలు నియంత్రించవచ్చు. శిశువుల సంరక్షణకు ఉపయోగించే బేబీ కిట్ మార్కెట్‌లో రూ.1500 నుంచి రూ.1800 ధరకు లభిస్తున్నాయి. అయితే గిరిజనులు, నిరుపేద కుటుంబాలకు చెందిన తల్లులకు బేబీ కిట్లు కొనుగోలు చేసుకునే ఆర్థిక పరిస్థితి ఉండదు. దీంతో గిరిజన ప్రాంతంలో శిశువుల సంరక్షణకు పాత దుస్తులను ఉపయోగిస్తుంటారు. దీంతో శిశువుల్లో వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన నాటి టీడీపీ ప్రభుత్వం 2016లో ఎన్టీఆర్ బేబీ కిట్ల పంపిణీని ప్రారంభించింది. ఆస్పత్రిలో ప్రసవం పొందిన ప్రతి తల్లికి బేబీ కిట్ అందజేసేవారు. దీంతో తల్లులకు బేబీ కిట్లు కొనుగోలు చేసే ఆర్థిక భారం తగ్గింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ బేబీ కిట్ల పంపిణీ పథకాన్ని రద్దు చేసింది. ప్రభుత్వాస్పత్రులలో ప్రసవం పొందిన తల్లులకు కిట్ల పంపిణీని నిలిపివేసింది. దీంతో తల్లులు బేబీ కిట్లు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిరిజన ప్రాంతంలో శీతాకాలం చలి వణికిస్తుంది. ఈ సమయంలో శిశువుల సంరక్షణకు కచ్చితంగా బేబీ కిట్లు ఉండాలి. గిరిజనులందరూ బేబీ కిట్లు కొనుగోలు చేసుకునే ఆర్థిక పరిస్థితి లేదు. దీంతో గత ఆరేళ్లగా తల్లులు శిశువులను సంరక్షించేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

బేబీ కిట్ల కోసం ప్రసవానికి ఆస్పత్రిలో చేరిన గర్భిణులు, బాలింతలు ఏడాదిగా ఎదురుచూస్తున్నారు. జీవో విడుదల చేసిన నెల రోజుల్లో బేబీ కిట్లు అందుబాటులోకి వస్తాయని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రకటించింది. దీంతో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమికోన్నత, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో నాణ్యమైన బేబీ కిట్లు అందుబాటులోకి వస్తాయని గర్భిణులు, బాలింతలు ఆశపడ్డారు. అయితే ఈ పథకం ఇప్పటి వరకు అందుబాటులోకి రాకపోవడంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నవజాత శిశువులకు పంపిణీ చేసే ఎన్టీఆర్ కిట్‌లో 11 రకాల వస్తువులను అందజేయనున్నట్టు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ జీవోలో పేర్కొంది. ప్రధానంగా దోమతెర కలిగిన బేబీ బెడ్, బేబీ మాంకితోష్, బేబీ డ్రెస్, టవెల్, న్యాపీ, జాన్సన్ 200 గ్రాముల పౌడర్, 100 మిల్లీలీటర్ల షాంపూ, 200 మిల్లీలీటర్ల ఆయిల్, బేబీ సబ్బు, సబ్బు బాక్స్, రేటెల్ బొమ్మను కిట్ ద్వారా అందజేయనున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి సాధ్యమైనంత త్వరగా ఎన్టీఆర్ బేబీ కిట్ల పంపిణీ ప్రక్రియను పునఃప్రారంభించాలని గర్భిణులు, బాలింతలు కోరుతున్నారు.



**అనంతపురం, పతాకం న్యూస్:** స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటికీ ... అటు పురుషులకు, ఇటు మహిళలకు అవస్థలు తప్పడం లేదు. అనంతపురం కళ్యాణదుర్గం రాయదుర్గం డిపోలకు చెందిన బస్సుల్లో రద్దీ అసాధారణంగా పెరిగింది. డబ్బులు ఇచ్చి టికెట్ కొనే పురుషులు కూడా కనీసం నిలబడటానికి చోటు లేక, గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. "డబ్బులు కట్టినా గౌరవంగా ప్రయాణం చేసే పరిస్థితి లేకపోతే ఎలా ?" అంటూ ... ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. టికెట్ కొన్నా చోటు దొరకడం లేదంటూ పురుషులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ... మహిళలు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి బస్సులు స్టాపు కు రావడం లేదు.. బస్సులను పాయింట్లలో ఆపకుండా దూరంగా ఆపుతున్నారని చెబుతున్నారు. ఉచితం కంటే సమయానికి బస్సు వస్తేనే తమకు మేలు జరుగుతుందని చెబుతున్నారు. ప్రతిరోజూ విధులకు వెళ్లే ప్రభుత్వ, ప్రైవేట్ మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు కిక్కిరిసి ఉండటం వల్ల ఆఫీసులకు సరైన సమయానికి చేరుకోలేకపోతున్నామని ప్రయాణీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "మాకు ఉచిత ప్రయాణం అవసరం లేదు, మేము టికెట్ కొనే స్థోమత కలిగి ఉన్నాము. మాకు కావలసింది ప్రశాంతమైన ప్రయాణం, సమయపాలన" అని పలువురు మహిళా ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. ఏ పథకమైనా ప్రజలకు అసౌకర్యం కలిగించినప్పుడు దాని అసలు ఉద్దేశం దెబ్బతింటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మహిళలు, పురుషులు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని, తక్షణమే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఎంతైనా ఉందంటూ పలువురు కోరుతున్నారు.

## రాయదుర్గం భూములకు భారీ డిమాండ్..



### మరోసారి ఆకాశాన్నంటిన ధరలు

**హైదరాబాద్, పతాకం న్యూస్:** రాయదుర్గం ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి ఆకాశాన్ని తాకాయి. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ నిర్వహించిన భూముల వేలంలో ఎకరాకు రూ.204 కోట్ల ధర పలికింది. దీంతో ఐటీ కారిడార్‌లో భూములకు ఉన్న భారీ డిమాండ్ మరోసారి స్పష్టమైంది. తాజాగా టీజీఐఐసీ 5.09 ఎకరాల భూమిని వేలానికి పెట్టగా, ఈ వేలం ద్వారా వెయ్యి కోట్ల రూపాయలకు పైగా ఆదాయం సమకూరింది. ఐటీ, వాణిజ్య రంగాల విస్తరణతో ఈ ప్రాంతంలో భూముల విలువలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, కేవలం రెండు రోజుల క్రితమే నిర్వహించిన మరో భూముల వేలంలో ఎకరాకు రూ.237 కోట్ల రికార్డు ధర పలికింది. ఆ వేలం ద్వారా టీజీఐఐసీకి రూ.1,490 కోట్ల ఆదాయం లభించింది.తాజా వేలం, గత వేలం కలిపి రెండు విడతల్లో టీజీఐఐసీకి దాదాపు రూ.2,500 కోట్ల ఆదాయం సమకూరింది. రాయదుర్గం ఐటీ కారిడార్‌లో భూముల కోసం పెట్టుబడిదారులు, సంస్థలు తీవ్ర పోటీ పడుతుండటంతో భూముల ధరలు కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి.

## ఆధార్ వివరాలివ్వడంపై పూర్తి నిషేధం లేదు: హైకోర్టు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆధార్ చట్టంలోని సెక్షన్ 33(1) ప్రకారం ఆధార్ సమాచారాన్ని వెల్లడించడంపై సంపూర్ణ నిషేధం లేదని, కోర్టు ఆదేశాల మేరకు తగిన రక్షణ చర్యలతో సంబంధిత వివరాలను అందజేయవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. నకిలీ ఆధార్ సృష్టించి మోసపూరితంగా భూమిని వేరొకరి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడి ఆధార్, బయోమెట్రిక్ వివరాలను పోలీసులకు అందజేయాలని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యుఐడిఎఐ)ను ఆదేశించింది. ఆధార్ వివరాలు సేకరించవద్దంటూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ ఆర్ రఘునందనరావుతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం సరిపల్లి గ్రామానికి చెందిన సీతారామాంజనేయులుకు గ్రామంలో సుమారు రెండెకరాల భూమి ఉంది. అయితే నకిలీ ఆధార్ కార్డు సృష్టించి విశాఖ రూరల్ మండలం ఎండాడకు చెందిన చలమారెడ్డి ప్రవీణ్‌కుమార్ పేరుతో భూమిని రెండు విక్రయ పత్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆయన గుర్తించారు. దీనిపై నమోదైన కేసును పెందుర్తి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీతారామాంజనేయులు కుమారుడు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన కోర్టు ఆదేశాల నేపథ్యంలో సంబంధిత సేల్ డీడ్లను రిజిస్ట్రేషన్ అధికారులు రద్దు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నకిలీ ఆధార్ కార్డు, బయోమెట్రిక్ వివరాలను అందించాలని బాధితుడు సమాచార హక్కు చట్టం కింద యుఐడిఎఐను కోరాడు. అయితే వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(జె)ను ప్రస్తావిస్తూ యుఐడిఎఐ 2024 జనవరి 4న ఆ సమాచారాన్ని నిరాకరించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించగా సింగిల్ జడ్జి పిటిషన్‌ను కొట్టివేశారు. దీనిపై దాఖలైన అప్పీల్‌ను విచారించిన డివిజన్ బెంచ్.. సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేస్తూ, నేర దర్యాప్తు అవసరాల కోసం కోర్టు ఆదేశాల మేరకు ఆధార్, బయోమెట్రిక్ వివరాలను సంబంధిత దర్యాప్తు సంస్థలకు అందజేయవచ్చని స్పష్టం చేసింది. గోప్యత హక్కు ముఖ్యమైనదే అయినప్పటికీ, నేర దర్యాప్తు, న్యాయపరమైన అవసరాల దృష్ట్యా చట్టం కల్పించిన మినహాయింపులను విస్మరించలేమని ధర్మాసనం పేర్కొంది.

## నీట్ రీఎగ్జామ్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు.. ఓఎంఆర్ విధానమే ఖరారు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** నీట్-యూజీ (NEET-UG 2026) రీఎగ్జామ్‌పై సుప్రీంకోర్టు (ాబజూతీవఎవ జశీబతీ) కీలక తీర్పు వెల్లడించింది. జూన్ 21వ తేదీన జరగబోయే చీజుజు పున:పరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్ష(జదీ) విధానంలో నిర్వహించాలనే పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో పరీక్షను యథాతథంగా ఓఎంఆర్ పద్ధతిలోనే (ావీ=) నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు బెంచ్, పరీక్షా విధానాన్ని అకస్మాత్తుగా మార్చడం ఆచరణాత్మకంగా సాధ్యం కాదని పేర్కొంది. సమయాభావం, అలాగే పరీక్ష నిర్వహణ సంస్థ అయిన ఎన్‌టీఏ (National Testing Agency)పై ఉన్న భారీ నిర్వహణ ఒత్తిడిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. పిటిషనర్లు, ముఖ్యంగా ఆర్‌జెడీ ఎంపీ సుధాకర్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌లో నీట్ పరీక్షలో సంస్కరణలు అవసరమని వాదించారు. పరీక్షను పూర్తిగా డిజిటల్ విధానంలో (జదీ) నిర్వహించడంతో పాటు, ప్రశ్నపత్రాల భద్రత కోసం ఎన్‌క్రిప్టెడ్ సిస్టమ్ ఉపయోగించాలని, అలాగే కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత నిఘా వ్యవస్థలు అమలు చేయాలని సూచించారు. అంతేకాకుండా, ప్రస్తుత పరీక్ష నిర్వహణ సంస్థ ఎన్‌టీఏ స్థానంలో కొత్త స్వతంత్ర అథారిటీని ఏర్పాటు చేయాలని కూడా పిటిషనర్ డిమాండ్ చేశారు. అయితే, సుప్రీంకోర్టు ఈ దశలో తక్షణ మార్పులు అమలు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేస్తూ, రీఎగ్జామ్‌ను ఇప్పటికే ప్రకటించిన విధంగా ఓఎంఆర్ విధానంలోనే కొనసాగించాలని ఆదేశించింది. పరీక్షా వ్యవస్థలో విస్తృత సంస్కరణలు అవసరమని కోర్టు అంగీకరించినప్పటికీ, వాటిని అమలు చేయడానికి సమగ్ర విధానపరమైన పరిశీలన అవసరమని పేర్కొంది. ఈ కేసులో నీట్ పరీక్షా విధాన మార్పులపై సుదీర్ఘ విచారణను వేసవి సెలవుల అనంతరం చేపట్టాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీంతో విద్యార్థులు, పరీక్షా వ్యవస్థపై దీర్ఘకాల ప్రభావం చూపే సంస్కరణలపై విస్తృతంగా చర్చ జరగనుంది.

## పొగాకు రైతులకు అండగా ఉంటాం : మంత్రి ఆనం

**నెల్లూరు, పతాకం న్యూస్:** పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ధరల సమస్యలు, మార్కెటింగ్ ఇబ్బందుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం డిసి పల్లి పొగాకు వేలం కేంద్రాన్ని స్థానిక రైతులతో కలిసి ఆయన సందర్శించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పొగాకు రైతులందరూ తమ ఇబ్బందులను మంత్రికి కూలంకషంగా వివరించి, గిట్టుబాటు ధర కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పొగాకు సాగులో ఒక సంవత్సరం మంచి దిగుబడి వస్తే, మరో సంవత్సరం వరదలు, కరువు, తెగుళ్లు, వాతావరణ మార్పులు వంటి అనేక ప్రతికూల పరిస్థితులు ఎదురవుతుంటాయని పేర్కొన్నారు. అలాంటి సందర్భాల్లో రైతులకు ప్రభుత్వం అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తోందన్నారు. పొగాకు రైతుల సమస్యలను ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖ రాసినట్లు వెల్లడించారు. త్వరలో ఢిల్లీలో జరిగే సమావేశాల్లో పాల్గొని రైతుల సమస్యలను నేరుగా కేంద్ర ప్రభుత్వానికి వివరించనున్నట్లు చెప్పారు. గతంలో అమలు చేసిన క్రాప్ హాలిడే కారణంగా రాష్ట్రంలోని పొగాకు సాగు విస్తీర్ణం తగ్గిపోగా, ఇతర రాష్ట్రాలు ఆ అవకాశాన్ని వినియోగించుకుని తమ



ఉత్పత్తిని పెంచుకున్నాయని, ఫలితంగా పొగాకు ఉత్పత్తి కోటా పంపిణీలో రాష్ట్రానికి నష్టం జరిగిందని వివరించారు. ఈ అంశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ప్రభుత్వం తరపున అన్ని విధాల కృషి చేసి మంచి ధర కల్పించి రైతులు నష్టపోకుండా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పొగాకు రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు, వేలం కేంద్ర నిర్వహణ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఒంటరిగా వెళ్తున్న మహిళలే లక్ష్యంగా చోరీలు..

**నెల్లూరు, పతాకం న్యూస్:** నగరంలో చైన్ స్నాచర్లు బీభత్సం సృష్టించారు. ఒకే రోజు ముగ్గురు మహిళల మెడల్లో బంగారు గొలుసులను అపహరించడం తీవ్ర కలకలం రేపింది. జేమ్స్ గార్డెన్, పడరుపల్లి, చిల్డ్రన్స్ పార్క్ ప్రాంతాల్లో దుండగులు బరితెగించారు. ఒంటరిగా వెళ్తున్న మహిళలే లక్ష్యంగా చోరీలు సాగాయి. మొత్తం 9 సవర్ల బంగారు గొలుసులు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. బాధిత మహిళల ఫిర్యాదు మేరకు నవాబుపేట, వేదాయ పాలెం, బాలాజీనగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు చైన్ స్నాచర్లను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. చోరీ జరిగిన ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

## వీరభద్ర క్వారీలో మైనింగ్ అధికారుల దాడులు



**ప్రకాశం, పతాకం న్యూస్:** ప్రకాశం జిల్లాలోని వీరభద్ర క్వారీలో మైనింగ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులకు దిగారు. విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మైనింగ్‌లో అక్రమాలు జరిగాయనే కోణంలో అధికారులు పలు అంశాలను రికార్డు చేశారు. క్వారీలోని మైనింగ్ పరిమితులు, తవ్వకాలు, నిల్వలు, అనుమతుల పూర్తి వివరాలను సేకరించారు. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ జరుగుతుందా? పరిమితికి మించి గ్రానైట్ తరలిస్తున్నారా? ఇలాంటి అంశాలను నిశితంగా పరిశీలించారు. ఇటీవల వైసిపి జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డికి చెందిన శ్రీ సూర్య గ్రానైట్స్ కంపెనీపై మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించి, నోటీసులు అందజేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం కడప జిల్లాకు చెందిన గుండ్లూరు ప్రతాపరెడ్డికి చెందిన వీరభద్ర క్వారీపై అధికారులు దాడి చేయడం జరిగింది. రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం జిల్లాలో పర్యటించి వెళ్లిన మరుసటి రోజే మైనింగ్ తనిఖీలు నిర్వహించడం గమనార్హం.

## రిమ్స్‌లో కార్మికుల నిరసన



**కడప, పతాకం న్యూస్:** ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మెడికల్ హెల్త్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జి జి హెచ్ అధ్యక్షులు పి.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఎదుట కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .... రాయలసీమ వ్యాప్తంగా పద్మావతి హాస్పిటల్ అండ్ ఫ్యాకల్టీ మేనేజ్మెంట్ సర్వీస్ వారు 8 నెలల క్రితం టెండర్ ద్వారా కాంట్రాక్టు దక్కించుకున్నారని పేర్కొన్నారు. అప్పటి నుంచి కార్మికులను వేధించడం మొదలుపెట్టారన్నారు. ఇప్పటివరకు కార్మికులను వేధిస్తూనే ఉన్నారని తెలిపారు. కార్మికులకు నెలనెలా సక్రమంగా వేతనాలు ఇవ్వడం లేదని చెప్పారు. వారానికి ఒక వీక్లీ ఆఫ్ ఇవ్వాల్సి ఉండగా పది రోజులకు ఒక ఆఫ్ ఇస్తున్నారని తెలిపారు. కార్మికులు పూర్తిగా నెల రోజులు విధులకు హాజరైనా కూడా వారి వేతనాలలో కోత విధిస్తున్నారని విమర్శించారు.

## తెలంగాణలో జనసేన సభకు అనుమతి నిరాకరణ..



**హైదరాబాద్, పతాకం న్యూస్:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. శేరిలింగంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సమావేశం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వడం లేదని డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. శాంతిభద్రతల సమస్యలు, పార్కింగ్ సదుపాయం లేకపోవడం వంటి కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. డీసీపీ మీడియాతో మాట్లాడుతూ.. జనసేన ప్రధాన కార్యదర్శి తమను కలిసి సభకు అనుమతి కోరారని తెలిపారు. ఈ సమావేశానికి సుమారు 2,000 మంది కార్యకర్తలు వస్తారని దరఖాస్తులో పేర్కొన్నారని చెప్పారు. అయితే, ఇటీవల ఏపీ నేతలు చేసిన కొన్ని వ్యాఖ్యల కారణంగా తెలంగాణలో ఉద్రిక్త వాతావరణం నెలకొందని తెలిపారు. ముఖ్యంగా ప్రొఫెసర్ నాగేశ్వరరావుపై ఆంధ్రప్రదేశ్‌లో కేసులు నమోదు కావడంతో ఇక్కడి ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సభ నిర్వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చెలరేగే ప్రమాదం ఉందని అన్నారు. దీంతో పాటు, సభకు వచ్చే రెండు వేల మందికి సరిపడా పార్కింగ్ సౌకర్యం లేదని కూడా తెలిపారు.

## ఏపీఈపీడీసీఎల్‌లో పలువురికి పదోన్నతులు, బదిలీలు

**పార్వతీపురం, పతాకం న్యూస్:**ఏపీఈపీడీసీఎల్‌లో పలువురు అధికారులకు పదోన్న తులు, బదిలీలు కల్పించారు. ఈ మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పి.త్రినాథరావు నియామకమయ్యారు. ఆయన విజయనగరం నుంచి బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ఇప్పటివరకు మన్యంలో ఎస్ఈగా పనిచేసిన కె.మల్లికార్జునరావుకు కమర్షియల్ జనరల్ మేనేజర్‌గా బదిలీ అయ్యింది. విశాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కె.రామినాయుడును పార్వతీపురానికి బదిలీ చేశారు. ఇక పార్వతీపురంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.లక్ష్మీనారాయణను విజయనగరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. పార్వతీపురంలో ఆపరేషన్ సెక్షన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఏ.గోపాలరావును విజయనగరం గ్రామీణ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు.

## మున్సిపల్ సేవలు ప్రైవేటీకరించొద్దు: శ్రీనివాసరావు



**విజయవాడ, పతాకం న్యూస్:** మున్సిపల్ సేవలను ప్రైవేటీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 673 మరియు 975 లను తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ జీవోల ద్వారా 14 సేవలను ప్రైవేట్ పరం చేస్తున్నారని, వాహనాలు, డ్రైనేజీ, మంచినీరు, ఆఫీస్ నిర్వహణ సహా పిపిపి పద్ధతిలో ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపాల్టీ ఎన్నికలు జరగలేదని, ప్రస్తుతం పాలక వర్గాలు లేవని, అధికారుల పర్యవేక్షణలోనే పాలన సాగుతోందని గుర్తుచేశారు. పిపిపి అమలైతే భవిష్యత్తులో ఎన్నికలు జరిగి చైర్‌పర్సన్లు వచ్చినా ఏమి చేయలేరని చెప్పారు. పౌర సేవలు అందించడానికే ఉన్న పంచాయతీలు, మున్సిపాలిటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫైనాన్స్ కమిషన్ ద్వారా 40శాతం నిధులు విడుదల చేస్తే ఏ సేవనూ ప్రైవేటీకరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సేవలను ప్రైవేటీకరించి యూజర్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వైసిపి ప్రభుత్వం వేసిన చెత్త పన్ను ప్రజలకు భారంగా మారిందని, ఇది రాజకీయ అంశంగా మారడంతో అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు 14 సేవలను ప్రైవేట్ పరం చేసి యూజర్ చార్జీలు వేస్తే పట్టణ ప్రజలపై వేల కోట్ల భారం పడుతుందని, ప్రజలు ఎలా భరిస్తారని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ వల్ల మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు, ప్రైవేట్ కంపెనీలు యంత్రాలతో కొద్దిమందితో పని చేయించుకుంటారని, దీంతో ఉద్యోగాలు ఊడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో 975 మరియు 673 లను ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ యూనియన్లు, ప్రజలు, పౌర సంఘాలు ఆందోళనలు చేస్తాయని హెచ్చరించారు.

## మహిళా సంఘాల బలోపేతానికే సూపర్ నారీ యాప్

**సీతానగరం, పతాకం న్యూస్:**మహిళా సంఘాల బలోపేతానికే ప్రభుత్వం సూపర్ నారీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఆర్థిక లావాదేవీల్లో పూర్తి పారదర్శకత కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'మన డబ్బులు – మన లెక్కలు' కార్యక్రమంపై వెంగాపురం గ్రామంలో ర్యాలీ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూపర్ నారీ యాప్ ద్వారా వ్యక్తిగత పొదుపు, అప్పులు, చెల్లింపుల వివరాలతో పాటు సంఘ సభ్యుల పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకో వచ్చన్నారు. ఇందులో ఆరోగ్య మిత్ర సేవలను ప్రభుత్వం అదనంగా చేర్చిందన్నారు. న్యాయ మిత్ర ఫీచర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. మహిళా సంఘాల ఉత్పత్తుల వివరాలు ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు.

# ఆస్తమా సమస్య ఉన్నవారు ఆహార విషయంలో జాగ్రత్తగా ఉండాలి!

చాలా మందిని వేధించే ఊపిరితిత్తుల సంబంధిత సమస్యల్లో ఆస్తమా ఒకటి. ఆస్తమా అనేది శ్వాసనాళాలను ప్రభావితం చేసే దీర్ఘకాలిక వ్యాధి. దీనిని పూర్తిగా నయం చేయడం సాధ్యం కాకపోయినా, సరైన చికిత్సతోపాటు సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా లక్షణాలను సమర్థ వంతంగా నియంత్రించవచ్చు. కొన్ని ఆహారాలు శరీరంలోని వాపులను తగ్గించి ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తే, మరికొన్ని ఆహారాలు ఆస్తమా లక్షణాలను మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉందని నిపుణులు తెలియజేస్తున్నారు. ఆస్తమా తీవ్రతను తగ్గించే, ఆస్తమాను మరింత తీవ్రతరం చేసే ఆహారాల గురించి వారు వివరిస్తున్నారు. పోషకాహారం శరీరంలో వాపు, ఆక్సిడేటివ్ ఒత్తిడి, రోగనిరోధక వ్యవస్థ పనితీరును ప్రభావితం చేస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు, ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే ఆహారం శ్వాసనాళాలను స్థిరంగా ఉంచడంలో సహాయపడుతుంది. మరోవైపు అధికంగా ప్రాసెస్ చేసిన చక్కెరలు, ట్రాన్స్ ఫ్యాట్లు కలిగిన ఆహారాలు వాపులను పెంచి ఆస్తమా లక్షణాలను తీవ్రతరం చేస్తాయి. యాపిల్స్, నారింజలు, బెర్రీలు వంటి తాజా పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించి శ్వాసనాళాల వాపులను నియంత్రించడంలో సహాయపడతాయి. ఫలితంగా ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. ఆకుకూరలు, బ్రోకలీ, క్యారెట్, క్యాప్సికం వంటి కూరగాయలు విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్‌ను సమృద్ధిగా అందిస్తాయి. ఇవి శరీరంలోని



వాపులను నియంత్రించడంలో సహాయ పడటంతోపాటు శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. సమతుల్యమైన ఆహారంలో భాగంగా వీటిని తరచూ తీసుకోవడం వల్ల ఆస్తమా లక్షణాల తీవ్రత తగ్గుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

తృణధాన్యాలు, అధిక ఫైబర్ కలిగిన ఆహారాలు పేగుల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. పేగుల్లోని మేలు చేసే బ్యాక్టీరియా పెరగడానికి ఇవి సహకరిస్తాయి. ఈ ప్రక్రియ ఊపిరితిత్తుల్లో వాపును తగ్గించడంలో పరోక్షంగా సహాయపడుతుందని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. సాల్మన్, సార్డిన్స్ వంటి కొవ్వు చేపలతోపాటు అవిసె గింజలు, వాల్‌నట్స్ వంటి వృక్ష ఆధారిత ఆహారాల్లో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి శ్వాసనాళాల వాపును తగ్గించి శ్వాస తీసుకోవడాన్ని సులభతరం చేయడంలో సహాయపడతాయి. పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు వంటి మొక్కల ఆధారిత ఆహారాలకు ప్రాధాన్యం ఇచ్చే ఆహార విధానం కూడా ఆస్తమా నియంత్రణలో ఉపయోగకరంగా ఉంటుంది. ఇది శరీరంలోని వాపును తగ్గించడంతోపాటు రోగనిరోధక శక్తిని మెరుగుపరచి లక్షణాలను నియంత్రించడంలో తోడ్పడుతుంది. అదే సమయంలో కొన్ని ఆహారాలను పరిమితం చేయడం కూడా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్స్ అధికంగా తీసుకునే వారిలో ఆస్తమా లక్షణాల తీవ్రత ఎక్కువగా కనిపిస్తోందని పలు అధ్యయనాలు వెల్లడించాయి. ముఖ్యంగా పిల్లలు, యుక్తవయస్కుల్లో ఈ ప్రభావం మరింత స్పష్టంగా ఉంటుందని పరిశోధనలు చెబు తున్నాయి. కృత్రిమ రంగులు, రుచులు, ప్రిజర్వే టివ్‌లు కలిగిన ఆహారాలు కొంతమందిలో శ్వాసనాళాలకు చికాకును కలిగిస్తాయి. అందువల్ల ప్రాసెస్ చేసిన ఆహారాలను సాధ్యమైనంత వరకు తగ్గించడం మంచిది. ఎండబెట్టిన పండ్లు, వైన్, కొన్ని బాటిల్ నిమ్మరసాల్లో ఉండే సల్ఫైట్లు కొంతమందిలో ఆస్తమా లక్షణాలను ప్రేరేపిస్తాయి. సున్నిత స్వభావం ఉన్నవారు ఇటువంటి ఆహారాల విషయంలో జాగ్రత్త వహించాలి. అధిక ఉప్పు వినియోగం కూడా ఆస్తమా రోగులకు అనుకూలం కాదు. ఎక్కువ సోడియం తీసుకోవడం వల్ల శరీరంలో ద్రవాలు నిల్వ ఉండి శ్వాసనాళాల సున్నితత్వం పెరిగే అవకాశం ఉంటుంది. దీనివల్ల లక్షణాలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. సమతుల్యమైన ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన వైద్య చికిత్స కలిసి ఆస్తమాను సమర్థవంతంగా నియంత్రిం చడంలో కీలక పాత్ర పోషిస్తాయి. సరైన ఆహార ఎంపికల ద్వారా శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడంతోపాటు దీర్ఘకాలి కంగా మెరుగైన జీవన నాణ్యతను పొంద వచ్చని నిపుణులు చెబుతున్నారు.

# యూఎస్‌లో 30 మంది భారతీయుల అరెస్ట్



**న్యూయార్క్:** యూఎస్‌లో అక్రమంగా నివసిస్తున్న 30 మంది భారతీయులను అరెస్ట్ చేసినట్లు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ వెల్లడించింది. త్వరలో వారిని స్వదేశానికి పంపుతామని స్పష్టం చేసింది. అరిజోనాలో యూమా సెక్టార్‌లో సరిహద్దు తనిఖీల్లో భాగంగా 52 మందిని అరెస్ట్ చేసినట్లు వివరించింది. వారిలో 36 మంది ట్రక్ డ్రైవర్లుగా పని చేస్తున్నారని తెలిపింది. అందులో 30 మంది భారతీయులు కాగా.. మిగిలిన వారు మెక్సికో, ఎల్ సాల్వెడార్, రష్యాలకు చెందిన వారని పేర్కొంది. అయితే వీరిలో కొందరు వాషింగ్టన్, కాలిఫోర్నియా, న్యూయార్క్, వర్జీనియా తదితర ప్రాంతాల నుంచి డ్రైవింగ్ లైసెన్స్ పొందారని వివరించింది. మరికొందరు వద్ద ఎలాంటి డ్రైవింగ్ లైసెన్స్ లేవని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ స్పష్టం చేసింది. తనిఖీల్లో భాగంగా వీరి వద్ద జో బైడెన్ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన ఉపాధి పత్రాలను గుర్తించామని తెలిపింది. కానీ ఇప్పుడవి చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. ఫెడరల్ చట్టం ప్రకారం వారందరిని స్వదేశానికి పంపుతామని పేర్కొంది. అమెరికాలో ఇటీవల వాణిజ్య వాహనాలను నడుపుతూ భారతీయ సంతతికి చెందిన పలువురు ట్రక్ డ్రైవర్లు ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీంతో వారిని అరెస్ట్ చేశారు. ప్రజా భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ తరహా ప్రమాదాలు నివారించేందుకు ప్రతి రోజు తనిఖీలు చేపట్టినట్లు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ వెల్లడించింది.

## అనవసర బలవంతం తగదు.. వందేమాతరం పూర్తి గేయంపై శశిథరూర్

కేరళ, పతాకం న్యూస్: కేరళలో 'వందేమాతరం' గేయంపై వివాదం చెలరేగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వందేమాతరం గేయంలోని ఐదు చరణాలతో పూర్తి గేయాన్ని పాడాలని ఆదేశించడం అనవసరమైన బలవంతమవుతుందని అభిప్రాయపడ్డారు. వందేమాతరం గేయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవిస్తారని, అయితే ప్రతి కార్యక్రమంలోనూ పూర్తి గేయం పాడాలంటూ తప్పనిసరి చేయడాన్ని సమర్థించడం కష్టమని అన్నారు. 'వందేమాతరం జాతీయ గేయం. దీనిని ఆలపించేటప్పుడు గౌరవంతో లేచి నిలబడతాం. మొదటి రెండు శ్లోకాలు జాతీయగీతానికి సమానమైన గౌరవాన్ని ఇస్తాయి. చాలా మందికి నోటికి కూడా వచ్చి ఉంటుంది' అని శశిథరూర్ పేర్కొన్నారు. సాంప్రదాయబద్ధంగా వందేమాతరం గేయాన్ని కార్యక్రమం ప్రారంభంలో పాడతారని, జాతీయగీతాన్ని చివర్లో పాడతారని అన్నారు.

# ఫార్మా వ్యర్థాలు శుద్ధి చేయకుండా బయటకు విడుదల!

## నల్లగా మారి దుర్వాసన వస్తున్న నీరు.. పట్టించుకోని కాలుష్య నియంత్రణ మండలి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పరవాడ మండలంలోని విశాఖ ఫార్మా సిటీలో పలు కంపెనీల యాజమాన్యాలు వ్యర్థాల నిర్వహణలో నిబంధనలను పదేపదే తుంగలో తొక్కుతున్నాయి. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో రసాయన వ్యర్థజలాలను శుద్ధి చేయకుండా ఇష్టారాజ్యంగా బయటకు విడుదల చేస్తున్నారు. తాజాగా పరవాడ నుంచి భరణికం వెళ్లే ప్రధాన రహదారిలో మల్లోడిగెడ్డ వాగు మొత్తం ఫార్మా వ్యర్థాలతో నిండిపోయి నీరంతా నల్లగా తయారైంది. వాగు పొడవునా నీటిపై పెద్ద ఎత్తున నల్లటి తెట్టు తేలింది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో రాకపోకలు సాగిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు.

విశాఖ ఫార్మాసిటీలోని కంపెనీలు ఉత్పత్తుల తయారీ క్రమంలో వెలువడే రసాయన వ్యర్థజలాలను శుద్ధి చేయాలి. ఇందుకోసం రాంకీ ఆధ్వర్యంలో ఇక్కడ కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ) వుంది. వ్యర్థాలను శుద్ధి చేసినందుకు టన్నుకు నిర్ణీత మొత్తం ఫీజు చెల్లించాలి. అయితే పలు కంపెనీల యాజమాన్యాలు ఈ ఖర్చును భారంగా పరిగణించి, రసాయన వ్యర్థజలాలను డ్రైనేజీల ద్వారా సమీపంలోని గెడ్డలు, వాగుల్లోకి విడిచిపెడుతున్నాయి. ఈ తరహా చర్యలు ఎక్కువగా వర్షాకాలంలో చేస్తుంటారు. శుద్ధి చేయని కాలుష్య వ్యర్థాలు వర్షం నీటితో కలిసిపోవడంతో ప్రభావం అంతగా కనిపించదు. ఇవి తొలుత గెడ్డల్లోకి, వాటి నుంచి సాగు నీటి చెరువుల్లోకి చేరుతున్నాయి. ఇప్పటికే పరవాడ పెద్ద చెరువు పూర్తిగా కలుషితమైంది. ఇందులో నీటిని పశువులు, జీవాలు తాగడం లేదు. ఈ నీటిని పొలాలకు పెట్టుకుంటే నేల పాడై, పంటల సాగుకు పనికిరాకుండా పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం మండు వేసవిలో సైతం కాలుష్య వ్యర్థాలను నిర్భయంగా బయటకు విడుదల చేస్తున్నారు. వారం క్రితం వరకు మల్లోడిగెడ్డలో చుక్క నీరు లేదు. పూర్తిగా ఎండిపోయింది. అయితే ఇటీవల వర్షం కురిసినప్పుడు కొన్ని ఫార్మా కంపెనీలు ఇదే అదనుగా భావించి రసాయన వ్యర్థ జలాలను డ్రైనేజీల ద్వారా గెడ్డలోకి విడిచిపెట్టాయి. ఇవి దిగువన వున్న మల్లోడిగెడ్డ వాగులోకి చేరాయి. తీవ్ర దుర్గంధం వస్తుండడంతో ఇటుగా రాకపోకలు సాగిస్తున్న వారు ఇబ్బంది పడుతున్నారు. గతంలో రాంకీ యాజమాన్యం వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా విడిచిపెట్టిందన్న కారణంతో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో రాంకీ యాజమాన్యం వాగులోని ఉన్న నీరును మోటార్లతో తోడించి సీఈటీపీకి తరలించారు. తాజాగా ఫార్మా వ్యర్థ జాలాలను బయటకు విడిచిపెట్టడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఫార్మా యాజమాన్యాలు తమ ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని వాపోతున్నారు. వ్యర్థాల సమస్యను కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తీవ్రంగా పరిగణించి, కఠన చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఫార్మా యాజమాన్యాలు తరచూ కాలుష్య వ్యర్థాలను బయటకు విడిచిపెడుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మల్లోడిగెడ్డ వాగులోకి ఫార్మా వ్యర్థ జలాలను విడిచిపెట్టిన పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.




# 11 నుంచి 'ఫిఫా వరల్డ్‌కప్' ప్రారంభం



యావత్ ప్రపంచానికి ఫుట్‌బాల్ ఫీవర్ ఎక్కించే మాస్ మహా జాతర 'ఫిఫా వరల్డ్‌కప్'నకు 39 రోజులపాటు.. సాకర్ కిక్కుతో.. చిందులు తొక్కించనుంది. నాలుగేళ్లకొకసారి ప్రపంచం మొత్తాన్నీ ఉర్రూతలూగించే సాకర్ సంరంభానికి ఈసారి అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. 23వ ఫిఫా వరల్డ్ కప్ ఈ నెల 11న ఆరంభం కానుండగా.. వచ్చే నెల 19న న్యూయార్క్‌లో జరిగే మెగా ఫైనల్‌తో ముగియనుంది. డిఫెండింగ్ చాంప్‌గా అర్జెంటీనా బరిలోకి దిగనుంది.ఇప్పటి వరకు జరిగిన ఈవెంట్లు ఒక లెక్క కాగా.. ఇప్పుడు జరగబోయేది అంతకు మించి అన్నట్టుగా సాగనుంది. 39 రోజులపాటు టోర్నీ సాగనుండగా.. 104 మ్యాచ్‌లకు 16 నగరాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. బరిలోకి దిగే జట్ల సంఖ్యను 32 నుంచి 48కి పెంచారు. ఆయా జట్లను నాలుగేసి చొప్పున 12 గ్రూప్‌లుగా వర్గీకరించారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2లో నిలిచిన జట్లతోపాటు మూడో స్థానంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన మరో 8 జట్లను నాకౌట్ రౌండ్-32కు ఎంపిక చేయనున్నారు. మొత్తంగా కలల కప్‌ను సొంతం చేసుకోవాలంటే ఆయా జట్లు 8 మ్యాచ్‌లు నెగ్గాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు జరిగిన 22 ప్రపంచ కప్‌ల్లో.. 11సార్లు ఐరోపా దేశాలు ఆతిథ్యం ఇచ్చాయి. ఆసియాలో తొలిసారి 2002లో జపాన్, కొరియాలు సంయుక్తంగా నిర్వహించాయి. 2010లో ఆఫ్రికా ఖండానికి మొదటిసారి వరల్డ్‌కప్ నిర్వహణ హక్కులు దక్కాయి. 2022 వరల్డ్‌క్‌పనకు పశ్చిమాసియా దేశమైన ఖతార్ వేదికైంది.

మూడోసారి వరల్డ్‌క్‌పనకు ఆతిథ్యం ఇస్తున్న దేశంగా మెక్సికో అరుదైన రికార్డును సొంతం చేసుకోనుంది. 1970, 1986లో రెండుసార్లు మెక్సికో సాకర్ కప్‌ను నిర్వహించింది. ఇప్పుడు అమెరికా, కెనడాతో కలసి మూడోసారి టోర్నీ జరపనుంది. అంతేకాకుండా మూడు దేశాలు సంయుక్తంగా వరల్డ్‌కప్‌ను నిర్వహించడం కూడా టోర్నీ చరిత్రలో ఇదే తొలిసారి. బ్రెజిల్‌పాటు ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీలు రెండేసిసార్లు వరల్డ్‌క్‌పనకు ఆతిథ్యం ఇచ్చాయి. సాకర్ వరల్డ్‌క్‌పను బ్రెజిల్ అత్యధికంగా ఐదుసార్లు సొంతం చేసుకోగా.. జర్మనీ, ఇటలీలు నాలుగేసి సార్లు దక్కించుకున్నాయి. అర్జెంటీనా మూడుసార్లు.. ఫ్రాన్స్, ఉరుగ్వే రెండేసి సార్లు సొంతం చేసుకొన్నాయి. ఇంగ్లండ్, స్పెయిన్ చెరోసారి మెగా కప్‌ను ముద్దాడాయి. సాకర్‌ను తొలిసారి 1900 ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టగా.. 1904లో ఫిఫా ఏర్పడింది. 'వరల్డ్‌కప్ పితామహుడు'గా చెప్పుకొనే ఫిఫా మాజీ అధ్యక్షుడు జూలెస్ రిమెట్.. 1920 విశ్వక్రీడల్లో సాకర్ కప్ ప్రతిపాదన చేశాడు. 1930లో తొలి ఫిఫా వరల్డ్‌క్‌పను 13 జట్లతో ఉరుగ్వేలో నిర్వహించారు. ఆతిథ్య దేశమైన ఉరుగ్వే 4-2తో అర్జెంటీనాను ఓడించి ఆరంభ టైటిల్‌ను సొంతం చేసుకొంది. ఆ తర్వాతి 1934లో ఇటలీ, 1938లో ఫ్రాన్స్ నిర్వహించాయి. 1942 మెగా కప్‌ను హిట్లర్ ఆధ్వర్యంలో జర్మనీలో జరపాలనుకొన్నా.. ప్రపంచ యుద్ధం కారణంగా రద్దు చేశారు. 1946లో కూడా వరల్డ్‌వార్ కారణంగా ఆగింది. ఇక, 1950 నుంచి ప్రతి నాలుగేళ్ల కొకసారి నిర్వహిస్తూనే వస్తున్నారు. భవిష్యత్‌లో 2030 వరల్డ్‌క్‌పను మొరాకో, స్పెయిన్, పోర్చుగల్ సంయుక్తంగా జరపగనుండగా.. 2034 మెగా టోర్నీ హక్కులను సౌదీ అరేబియా దక్కించుకొంది.

# రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ సంబరాలు లేవు



రాయల్ చాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండో ఏడాదీ ఐపీఎల్ టైటిల్ సొంతం చేసుకోవడంతో..ఆ జట్టు ఫ్యాన్స్ విజయ సంబరాలకోసం ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా బెంగళూరులో జట్టు పరేడ్ ఉంటుందని గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ వారికి నిరాశ కలిగించే నిర్ణయాన్ని ఆర్సీబీ యాజమాన్యం తీసుకుంది. ఈసారి 'విక్టరీ పరేడ్' లేదని ప్రకటించింది. గత ఏడాది తొలిసారి బెంగళూరు ఐపీఎల్ టైటిల్ అందుకోవడంతో పెద్ద ఎత్తున విజయోత్సవాలు నిర్వహించారు. సరైన ప్రణాళిక లేకపోవడంతో చిన్నస్వామి స్టేడి యం వద్ద తొక్కిసలాట జరిగి 11 మంది ఆర్సీబీ అభిమానులు మరణించిన సంగతి తెలిసిందే. దాంతోపాటు కర్ణాటక కొత్త ముఖ్యమంత్రిగా నియమితులైన డీకే శివకుమార్ ప్రమాణస్వీకారోత్సవం కూడా ఉన్న నేపథ్యంలో 'టైటిల్' సంబరాలు జరపకూడదని ఆర్సీబీ యాజమాన్యం నిర్ణయించిందట. ఈనెల మూడున శివకుమార్ సీఎంగా ప్రమాణం చేయనున్నారు. ఆ కార్యక్రమం జరిగే గవర్నర్ నివాసం చిన్నస్వామి స్టేడియానికి సమీపంలో ఉంది. పైగా..బెంగళూరులో నిషేధాజ్ఞలు అమలులో ఉండడం కూడా విజయోత్సవాలు వద్దనుకోవడానికి మరో కారణం. ఆర్సీబీ ఐపీల్ టైటిల్ నిలబెట్టుకోవడంతో బెంగళూరులోఫ్యాన్స్ సంబరాలు మిన్నంటాయి. ముందుజాగ్రత్తగా పోలీసులు ఆంక్షలు విధించినా..మ్యాచ్ ముగిశాక అభిమానులు భారీగా రోడ్లపైకి వచ్చి వేడుకలు నిర్వహించారు. అదేసమయంలో గత ఏడాది బెంగళూరు జట్టు విజయోత్సవాల సందర్భంగా తొక్కిసలాట జరిగి మృతి చెందిన 11 మంది ఫ్యాన్స్‌నూ వారు స్మరించుకున్నారు.




# 'రాకా'లో ఫెమీనా జార్జ్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'రాకా'. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె ప్రధాన హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్టులోకి మలయాళ నటి ఫెమీనా జార్జ్ కూడా అడుగుపెట్టారు. 'మిన్నల్ మురళి' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఫెమినా, 'రాకా'లో భాగం కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. తన కెరీర్‌లోనే ఇది అతిపెద్ద ప్రాజెక్ట్ అని ఆమె తెలిపారు. అల్లు అర్జున్‌తో కలిసి స్క్రీన్ పంచుకోవడం ఒక కల నిజమైన క్షణమని ఆమె అభివర్ణించారు. అల్లు అర్జున్ నటించిన 'హ్యాపీ' సినిమా చూసినప్పటి నుంచి తాను ఆయనకు పెద్ద అభిమానిని అయిపోయానని ఫెమీనా పేర్కొన్నారు. తన పాత్ర నిడివి చిన్నదే అయినా, ఇంత భారీ చిత్రంలో అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు వివరించారు.

ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో నలుగురు హీరోయిన్లు ఉండొచ్చని ప్రచారం జరుగుతుండగా, జాన్వీ కపూర్, రష్మిక మందన్న వంటి వారి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే, ఈ వార్తలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. సై-ఫై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మిన్నల్ మురళి చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఫెమీనా జార్జ్. టొవినో థామస్ హీరోగా వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'మిన్నల్ మురళి'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న యువ నటి ఫెమీనా జార్జ్, తన కెరీర్‌ను ఆచితూచి ప్లాన్ చేసుకుంటున్నారు. తొలి సినిమాతో వచ్చిన భారీ విజయం తర్వాత, పాత్రల ఎంపికలో ఎంతో పట్టింపుగా వ్యవహరిస్తూ విభిన్నమైన కథలను ఎంచుకుంటున్నారు. ఇటీవల ఆమె నటించిన 'కరక్కం' అనే మ్యూజికల్ హారర్ కామెడీ చిత్రం బక్రీద్ సందర్భంగా మే 28న థియేటర్లలో విడుదలైంది. సుభాష్ లలిత సుబ్రహ్మణియన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీనాథ్ భాసి సరసన ఆమె నటించారు. ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతోందని టాక్ వస్తోంది.

'మిన్నల్ మురళి'లో బ్రూస్ లీ లతిక అనే కరాటే శిక్షకురాలి పాత్రలో ఫెమీనా నటనకు మంచి మార్కులు పడ్డాయి. సౌదీ అరేబియాలో పుట్టి, కేరళలో చదువుకున్న ఆమె, మోడలింగ్ నుంచి నటన వైపు వచ్చారు. ఆ తర్వాత 'తీప్పొరి బెన్నీ', 'శేషం మైకేల్ ఫాతిమా' వంటి చిత్రాల్లో నటించినా, 'మిన్నల్ మురళి' పాత్రనే ప్రేక్షకులు ఎక్కువగా గుర్తుంచుకున్నారు. ప్రస్తుతం ఫెమీనా 'హైకూ' అనే రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. యువరాజ్ చిన్నసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవలే కేరళలోని ఇడుక్కిలో ప్రారంభమైంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ చురుగ్గా ఉండే ఫెమినా, విభిన్న పాత్రలతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకునే ప్రయత్నంలో ఉన్నారు.

# 'మస్సా మస్సా' వీడియో సాంగ్ రిలీజ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఈ సాయంత్రం విజయవాడలో పెద్ది ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వ హించారు. హీరో రామ్ చరణ్, హీరోయిన్ జాన్వీ కపూర్, దర్శ కుడు బుచ్చిబాబు సానా, సంగీత దర్శ కుడు ఏఆర్ రెహ మాన్, ఏపీ సినిమా టోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు ఈ ఈవెంట్‌కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 'మస్సా మస్సా' అనే పవర్‌ఫుల్ సాంగ్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఇప్పటికే ఆడియో రూపంలో సంగీత ప్రియులను ఆకట్టుకున్న ఈ పాట, ఇప్పుడు మేకింగ్ విజువల్స్‌తో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ఈ వీడియో సాంగ్‌లో సినిమా కోసం రామ్ చరణ్ పడిన కష్టాన్ని, ఆయన డెడికేషన్‌ను కళ్లకు కట్టినట్టు చూపించారు. పాత్రకు తగ్గట్టుగా శరీరాకృతిని మార్చుకోవడం కోసం, యాక్షన్ సన్నివేశాల కోసం ఆయన చేసిన కఠినమైన కసరత్తులు, శిక్షణకు సంబంధించిన విజువల్స్ చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. చరణ్ హార్డ్ వర్క్ మైండ్ బ్లోయింగ్ అనేలా ఉందని కామెంట్లు చేస్తున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ హై-ఎనర్జీ ట్రాక్‌కు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, విశాల్ మిశ్రా తన గాత్రంతో ప్రాణం పోశారు. 1980ల నాటి గ్రామీణ ఆంధ్రప్రదేశ్ నేపథ్యంలో, స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా 'పెద్ది' రూపొందుతోంది. ఇందులో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్.

# 12న 'పోలీస్ కంప్లైంట్'



వరలక్ష్మి శరత్‌కుమార్ , నవీన్ చంద్ర ప్రధాన పాత్రధారులుగా నటించిన హారర్ యాక్షన్ థ్రిల్లర్ 'పోలీస్ కంప్లైంట్' . సంజీవ్ మేగోటి దర్శకత్వంలో బాలకృష్ణ మహారాణా నిర్మిం చారు. సినిమా ఈనెల 12న ప్రేక్షకుల ముం దుకు వస్తోంది. నిర్వహించిన ప్రత్యేక వేడుకలో ట్రైలర్‌తో రెండు ప్రత్యేక గీతా లను మేకర్స్ విడుదల చేశారు.

కృష్ణ నటించిన పలు చిత్రాల టైటిళ్లను గుర్తు చేస్తూ రూపొందించిన ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్‌ని కృష్ణ అభిమానుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈ పాటలో కృష్ణ వీరాభిమాని, నటుడు కృష్ణసాయి నటించారు. 'నువ్వట్టా సూత్తా ఉంటే' అనే మరో గీతాన్ని తెలంగాణ డీఐజీ రమణారెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్, కృతి వర్మ, ప్రీతీ సుందర్ తదితరులు పాల్గొన్నారు.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**